అందరికీ నమస్కారం.

ఇంగ్లీష్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం, **జనవరి నెల 23వరోజు**.

సనాతన భారతీయ పంచాంగ గణనలో చాంద్రమాన పద్ధతిలో ఇది శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

హేమంత ఋతువు.

పుష్య మాసం.

శుక్లపక్షం.

త్రయోదశి తిథి.

మంగళవారం.

ఆరుద్ర నక్షత్రం.

నిన్నటి తిథి ద్వాదశి, ఈరోజు తిథి త్రయోదశి.

నిన్నటిదినం అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తి ప్రతిష్ఠ జరిగింది కదా - నిన్నటి రోజు కూర్మ ద్వాదశి అంటారు. అంటే విష్ణు మూర్తి కూర్మావతారం ధరించిన రోజు.

శ్రీరామనవమి అంటే శ్రీరామచంద్రమూర్తి అవతరించిన రోజు కదా, అలాగే కూర్మమూర్తిగా అవతరించిన రోజు కూర్మ ద్వాదశి.

కూర్మమూర్తిగా పూజలందుకొనే అరుదైన పుణ్యక్షేత్రం మన రాష్ట్రంలోనే మనకి చాలా దగ్గరగా శ్రీకాకుళం జిల్లాలో ఉన్న శ్రీకూర్మం.

అవకాశం కలిగినప్పుడు అక్కడికి వెళ్ళి దర్శించుకుందాం.

స్వస్తి.

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

ఇంగ్లీష్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం, **జనవరి నెల 24వ రోజు**.

సనాతన భారతీయ పంచాంగ గణనలో మనం అనుసరించేది చాంద్రమానం.

చాంద్రమానం అంటే చంద్రుడి గమనాన్ని బట్టి కాలాన్ని లెక్కించే పద్ధతి.

చాంద్రమానంతో పాటు సౌరమానం, బార్హస్పత్యమానం అనే విధానాలు కూడ ఉన్నాయి.

సౌరమానాన్ని తమిళం మాట్లాడే ప్రాంతాలలో వాడతారు. బార్హస్పత్యమానం ఉత్తరాది రాష్ట్రాలలో వాడతారు.

మనం అనుసరించే చాంద్రమాన పద్ధతిలో ఇది శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

హేమంత ఋతువు.

పుష్య మాసం.

శుక్ల పక్షం.

చతుర్దశి తిథి.

బుధవారం.

పునర్వసు నక్షత్రం.

స్వస్తి.

--------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఆకాశంలో నక్షత్రాలు లెక్కపెట్టలేనన్ని ఉన్నాయి.

కాని కాలాన్ని లెక్కించడానికి జ్యోతిష శాస్త్రంలో వాడే నక్షత్రాలు 27 మాత్రమే.

సూర్యుడు ఈ 27 నక్షత్రాలలోనూ సంచరిస్తూ ఉంటాడు సంవత్సరం అంతా.

అంటే ఒక్కొక్క నక్షత్రంలోను సుమారు 13 రోజులు సంచరిస్తాడనమాట. దానిని ఆ నక్షత్రం పేరుతో కలిపి కార్తె అని పిలుస్తారు.

అలా తన ప్రయాణంలో సూర్యుడు ఈరోజు శ్రవణా నక్షత్రంలో ప్రవేశిస్తాడు.

ఈరోజునుండి 13 రోజుల కాలాన్ని శ్రవణ కార్తె అంటారు.

కార్తెల గురించి తెలుసుకోవడం వ్యవసాయం చేసేవారికి చాలా అవసరం.

కార్తెలు వాతావరణం ఏవిధంగా ఉండబోతోందో తెలియజేస్తాయి.

ఉదాహరణకి రోహిణి కార్తెలో రోళ్ళైనా పగులుతాయి అంటారు అంటే ఎండలు బాగా ఎక్కువగా ఉంటాయని అర్థం.

మృగశిర కార్తెకి ముంగిళ్ళు ముల్లోకాలు చల్లబడతాయంటారు, అంటే తొలకరి వానలు ప్రారంభం అవుతాయని అర్థం.

ఇంతేకాదు, ఏ కార్తెలో ఏ వాతావరణం ఉన్నదో దాన్నిబట్టి తరువాత రాబోయే కార్తెలలో ఎలా ఉంటుందో forecast కూడ చెప్పవచ్చు.

ఉదాహరణకి ఆరుద్ర కురిస్తే ఆరుకార్తెలు కురుస్తుంది అంటారు.

ఏ కార్తెలో ఎటువంటి వ్యవసాయ పనులు చేయాలో అంటే నేల దున్నడం, విత్తనాలు వేయడం, నీరు పెట్టడం, కలుపు తీయడం వంటివి చేయాలో కూడ చెప్పేవారు.

ఈ విజ్ఞానాన్ని అంతటినీ సామెతలు, నానుడుల రూపంలో వ్యాప్తి చేసారు మన పూర్వులు.

అద్భుతమైన ఆ విజ్ఞానానికి, దానిని మనకందించిన పెద్దలకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

స్వస్తి.

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

ఇంగ్లీష్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం, **జనవరి నెల 25వ రోజు**.

సనాతన భారతీయ సంస్కృతిలో మనం కాలాన్ని కొలిచే పద్ధతి చాంద్రమానం.

ఏ పెళ్ళి పత్రిక చదివినా ముందుగా ఉండే పదం స్వస్తి.

స్వస్తి అంటే మంగళం కలగాలి. శుభం కలగాలి. అందరూ సుఖంగా ఉండాలి అని.

వేద మంత్రాలు ఆశీర్వచనంగా పండితులు ఎవరైనా చదివినప్పుడు, ఏదైనా కార్యక్రమం ప్రారంభించినప్పుడు వేదమంత్రాలతో స్వస్తివాచనం చేస్తారు.

అందరూ సుఖసంతోషాలతో ఉండాలి అని అభిలషించడం కోరుకోవడం మన సంస్కృతి.

ఆ తరువాత ఉండే పదం శ్రీ చాంద్రమానేన అని.

మనం అనుసరించే అలాంటి చాంద్రమాన పద్ధతిలో ఇది శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

హేమంత ఋతువు.

పుష్య మాసం.

శుక్ల పక్షం.

పౌర్ణమి తిథి.

గురువారం.

పునర్వసు నక్షత్రం.

స్వస్తి.

--------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఈ రోజు పుష్య పూర్ణిమ. పుచ్చపువ్వులా వెన్నెల వెల్లివిరుస్తుంది ఈ పూర్ణిమ నాడు.
ఉత్తర భారతదేశంలో ఇది చాలా పవిత్రమైన రోజుగా పరిగణించబడుతుంది.
ప్రజలు గంగా, యమున వంటి పుణ్య నదులలో స్నానాలు చేస్తారు.

ఈ పూర్ణిమ నాడు రాత్రి చంద్రుడు పుష్యమీ నక్షత్రం సమీపంలో ఉంటాడు కనుక ఈ నెలని పుష్య మాసం అనే పేరుతో పిలుస్తారు.

పుష్యమీ నక్షత్రం కర్కాటకం అనే రాశిలో ఉన్నది. ఈ రాశిలో చంద్రుడు ఉచ్ఛ స్థితిలో ఉంటాడట అంటే మంచి ప్రకాశవంతంగాను, ప్రభావవంతంగాను ఉంటాడనమాట.
Street Lights వెలుగులు నగరాల్లోను, చుట్టుపక్కల పల్లెటూర్లలోను బాగా ఎక్కువ కాంతిని వెదజల్లడం వలన వెన్నెల అందాన్ని, అది ఇచ్చే హాయిని, ప్రకృతి మనకి ప్రసాదించే ప్రశాంతతని అనుభవించలేకపోతున్నాం.
అవకాశం ఉన్నవారు ఊరికి దూరంగా వెళ్లి చూస్తే చుక్కల మిలమిలలు, చందమామ అందాలు ఈరోజు బాగా కనువిందు చేస్తాయి.
చంద్రుడు సముద్రం మీద ప్రభావం చూపిస్తాడు అని, పౌర్ణమికి అమావాస్యకి ఆటు పోట్లు వస్తాయని మనకి సనాతన వైదిక విజ్ఞానం చెబుతుంది, సైన్స్ కూడ అది నిజమే అంటుంది.
సైన్స్ చెప్పనిది, మన సంస్కృతి మనకి చెప్పే ఇంకొక విషయం చంద్రుడు మన మనస్సుని ప్రభావితం చేస్తాడు అని.
ఉచ్ఛ స్థితిలో ఉన్న పుష్య పూర్ణిమ నిండు చంద్రుణ్ణి ఒక్కసారి అలా తేరిపార చూడగలిగితే మన మనస్సంతా నిర్మలంగా హాయిగా సంతోషంగా అవుతుంది.
ప్రయత్నం చేద్దామా.
అద్భుతమైన సనాతన  వైదిక విజ్ఞానానికి, దానిని మనకందించిన పెద్దలకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

స్వస్తి.

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

---------------------------------------

అందరికీ నమస్కారం.

ఇంగ్లీష్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం, **జనవరి నెల 26వ రోజు**.

జ్యోతిష శాస్త్రంలో ఒక భాగం పంచాంగం అని తెలుసుకున్నాం ఇంతకు ముందు.

జ్యోతిస్సులకి సంబంధించిన శాస్త్రం జ్యోతిషం.

జ్యోతిస్సులు అంటే బాగా ప్రకాశించేవి అని అర్థం.

ఆకాశంలో బాగా ప్రకాశించే గ్రహాలు, నక్షత్రాలు, వాటి గమనం గురించి తెలిపేది జ్యోతిషం.

సూర్యుడు, చంద్రుడి తో పాటు మనకి బాగా ప్రకాశవంతంగా కనిపించేవి మన సౌర కుటుంబంలో ఉన్న కుజుడు, బుధుడు, గురుడు, శుక్రుడు, శని అనే గ్రహాలు.

ఈ ఏడు గ్రహాల పేర్ల తోనే ఏడు వారాల పేర్లు ఏర్పడ్డాయి. ఏ గ్రహం పేరుతో ఏ వారమో, ఆ వారానికి ఉండే ఇతరమైన పేర్లు ఏవో తెలుసుకునే ప్రయత్నం చేయండి పెద్దవారిని అడిగి.

ఇక, మనం కాలాన్ని లెక్కించే చాంద్రమాన పద్ధతిలో

ఇది శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

హేమంత ఋతువు.

పుష్య మాసం.

కృష్ణ పక్షం.

పాడ్యమి తిథి.

శుక్రవారం.

పుష్యమీ నక్షత్రం.

స్వస్తి.

---------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

-------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఈ రోజు నుండి కృష్ణ పక్షం ప్రారంభమౌతుంది.

శుక్ల అంటే తెల్లనిదని, కృష్ణ అంటే నల్లనిదని అర్థం.

పౌర్ణమి నుండి చంద్రుడు పదిహేను రోజులు తన కాంతిని క్రమంగా తగ్గించుకుంటూ చిన్న రేఖా మాత్రంగా అయిపోయి చివరకు అమావాస్యనాడు ఇంచుమించు కనబడకుండా అయిపోతాడు.

చంద్రుడి కాంతి తగ్గిపోతే రాత్రి చీకటిగా, అంతా నల్లగా ఉంటుంది. అందుచేత దీనిని కృష్ణ పక్షం అన్నారు.

పక్షం అంటే పదిహేను రోజులు.

ఈరోజు నుండి చంద్రుడు ఒక రోజుకంటె ఒక రోజు ఆలస్యంగా ఉదయిస్తూ ఉంటాడు.

పౌర్ణమి నాడు ఇంచుమించు సూర్యుడు అస్తమించగానే ఉదయించే చంద్రుడు, క్రమంగా ఆలస్యంగా ఉదయించడం మొదలుపెట్టి అమావాస్య నాటికి రాత్రి అంతా గడిచిపోయాక ఇంచుమించు సూర్యుడితో పాటు ఉదయిస్తాడు. అందుకనే ఆరోజు రాత్రి చంద్రుడు మరి కనబడడు.

జ్యోతిష శాస్త్రం గురించి తెలుసుకుంటున్నాం అంటే మనం కొంత పరిశీలన కూడ చేస్తూ ఉండాలి. థీరీ, ప్రాక్టికల్ రెండూ ఉండాలి.

ఈ రోజునుండి ప్రతిరోజూ చంద్రుడు ఉదయించే సమయం, ఎంత పరిమాణంలో (సైజులో) ఉంటాడు వగైరా వివరాలు రోజూ గమనిస్తూ ఉండండి, మనకే ఆశ్చర్యం కలుగుతుంది క్రమం తప్పకుండా ఎలా ఈ గ్రహాలన్నీ ఒకే వేగంతో తిరుగుతున్నాయో అని.

అద్భుతమైన అటువంటి సనాతన  వైదిక విజ్ఞానానికి, దానిని మనకందించిన పెద్దలకి నమస్కరించి  ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

స్వస్తి.

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

మనం కాలాన్ని లెక్కించే చాంద్రమాన పద్ధతిలో ఇది శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

**జనవరి నెల 27వ రోజు.**

ఉత్తరాయణం.

హేమంత ఋతువు.

పుష్య మాసం.

కృష్ణ పక్షం.

విదియ తిథి.

శనివారం.

ఆశ్లేష నక్షత్రం.

అయనం అంటే గమనం, ప్రయాణించడం అని ఒక అర్థం.

ఉత్తరాయణం అంటే ఉత్తరదిశగా ప్రయాణించడం.

సూర్యుడు ఆరు మాసాలు ఉత్తరదిక్కుగాను, ఇంకొక ఆరు మాసాలు దక్షిణ దిక్కుగాను ప్రయాణిస్తున్నట్టు కనిపిస్తాడు.

గత సంవత్సరం జూలై 17 నుండి ఈ జనవరి నెల 15వ తారీఖు వరకు దక్షిణ దిశగా ప్రయాణించిన సూర్యుడు తన గమనాన్ని మార్చుకొని మరల ఉత్తరం వైపు ప్రయాణిస్తున్నాడు గత 12 రోజులుగా.

మనం దీనిని పరిశీలించవచ్చు.

ఈరోజు ఒక చోట సూర్యోదయం సమయానికి సూర్యునికి ఎదురుగా నిలబడి సరిగ్గా సూర్యుడు ఆకాశంలో ఎక్కడ ఉదయిస్తున్నాడో గమనించండి - ఒక చెట్టును గాని,

భవనాన్ని గాని, కొండని గాని గుర్తుగా పెట్టుకోండి. లేదా సూర్యోదయపు ఎండ మీ ఇంట్లో ఎక్కడ పడుతోందో అక్కడ ఒక గీత గీయండి.

ప్రతిరోజు అదే ప్రదేశంలో నిలబడి సూర్యోదయాన్ని చూస్తూ ఉండండి, గీత గీస్తూ ఉండండి. గుర్తుగా పెట్టుకున్న చెట్టు, కొండ, భవనాలకి ఎటువైపు సూర్యోదయం అవుతోందో గమనించండి.

ఒక నెల గడిచేసరికి క్రమంగా రోజుకి రోజు సూర్యోదయం అయే చోటు ఉత్తరం వైపు జరగడం కనిపిస్తుంది.
జూలై 17 వరకు సూర్యుడు అలా ఉత్తరం వైపు చేసే ప్రయాణమే ఉత్తరాయణం.
ఈ ఉత్తరాయణ కాలంలో వైదికమైన యజ్ఞాలు, యాగాలు, దేవాలయ ప్రతిష్ఠలు, ఉపనయనాలు వంటి పుణ్య కార్యాలు చేస్తారు.

స్వస్తి.

---------------------------------------
2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు
---------------------------------------
ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.
ఈ రోజు విదియ తిథి.

కొత్త పాఠాలు ప్రారంభం చేసే రోజు విదియ.
వేదం, వేదానికి సంబంధించిన శాస్త్రాలు చదువుకొనే వారు విదియ నుండి అయిదు రోజులు కొత్త పాఠం నేర్చుకుంటారు.
అష్టమి నాడు పాత పాఠం మాత్రమే చదువుకుంటారు.
నవమి నుండి అయిదురోజులు మరల ఆ కొత్తపాఠమే నేర్చుకుంటారు.
చతుర్దశి నాడు పాత పాఠం మాత్రమే చదువుకుంటారు.
తరువాత రెండు రోజులు సెలవు.

ఇలా ఒకే కొత్త పాఠాన్ని పదిరోజులపాటు గురువుగారు చెప్తారు.
శిష్యులు ఆ పాఠాన్ని పదకొండవ రోజునుండి రోజుకి పదిసార్లు చొప్పున వల్లె వేస్తారు.
ఇరవై ఒకటవ రోజు నుండి అదే పాఠాన్ని రోజూ రెండు మూడు మార్లు ఏకరువు పెడతారు.
మొత్తం మూడు పక్షాలు అంటే నలభై అయిదు రోజులు అయేసరికి ఆ పాఠం కంఠస్థం అయిపోతుంది.

ఇక జీవితంలో ఎప్పుడూ ఒక్క అక్షరం కూడ మరిచి పోరు వారు.
అందుకే విదియ విద్యారంభానికి ప్రశస్తమైన రోజు అని అంటారు.
అద్భుతమైన అటువంటి సనాతన వైదిక విద్యాభ్యాస పద్ధతులకి, వాటిని మనకందించిన పెద్దలకి నమస్కరించి  ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

స్వస్తి.
-------------------------------------“      ”-----------------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు
---------------------------------------
అందరికీ నమస్కారం.

ఇంగ్లీష్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **జనవరి నెల 29వ రోజు**.
మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే చాంద్రమాన పద్ధతిలో
ఇది శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.
ఉత్తరాయణం.
హేమంత ఋతువు.
పుష్య మాసం.
కృష్ణ పక్షం.
చవితి తిథి.

సోమవారం.

పుబ్బ నక్షత్రం.
చంద్రుడు ఉదయించే సమయాలు రోజూ పరిశీలిస్తున్నారనుకుంటాను.
పౌర్ణమి నాడు కర్కాటకం అనే రాశిలో ఉన్న చంద్రుడు ఈరోజు సింహ రాశిలో ప్రయాణిస్తున్నాడు.

చంద్రుడు ఏ నక్షత్రంలో ఉన్నప్పుడు ఎవరు జన్మిస్తారో వారికి అది జన్మ నక్షత్రం అవుతుంది.
ఆ నక్షత్రం ఉన్న రాశి జన్మరాశి అవుతుంది.
మీ మీ జన్మ నక్షత్రాలు, జన్మ రాశులు తెలుసా?
శ్రీరామచంద్రుడి నక్షత్రం పునర్వసు.
శ్రీకృష్ణుడి నక్షత్రం రోహిణి.
వేంకటేశ్వర స్వామి నక్షత్రం శ్రవణం.
లక్ష్మీ దేవి నక్షత్రం ఉత్తర.
మరి మీ నక్షత్రం ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేయండి.
మీ కుటుంబ సభ్యులవి కూడ తెలుసుకోండి.

స్వస్తి.

--------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే వివరాలు

--------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.
ఇది హేమంత ఋతువు అని మనకు తెలుసు.
ఋతువు అంటే రెండు నెలల కాలం.
మార్గశిరం, పుష్యం ఈ రెండు మాసాలు హేమంత ఋతువు.
సుమారుగా డిసెంబరు, జనవరి నెలలలో వస్తుంది ఈ ఋతువు.

కొందరు దీనినే హిమవంత ఋతువు అనికూడ అంటారు.హిమం అంటే మంచు.

ఈ రెండు నెలలలోను బాగా హిమపాతం ఉంటుంది.మంచు పడుతూ ఉంటుంది.

ఉదయం కొంత సేపటివరకు దగ్గరగా ఉన్న చెట్లు ఇళ్లు లాంటివి కూడ కనిపించనంత మంచు, పొగలా వ్యాపించి ఉంటుంది.

కొన్ని రకాల చెట్ల ఆకులన్నీ ఈ ఋతువులోనే పసుపు రంగులోకి మారిపోతాయి.
ఈ ఋతువులోనే పసుపు పచ్చని పూవులు ఉండే చేమంతులు, బంతిపూలు వంటి పూల మొక్కలన్నీ బాగా పూస్తాయి.

మనం తినే అన్నం వరి ధాన్యం నుండి వస్తుంది. చపాతీలు గోధుమ నుండి వస్తాయి.
ఈ రెండు పంటలు బాగా పండి కోతకి వచ్చే సమయం ఈ ఋతువే.

వరి, గోధుమ కంకులు పసుపు పచ్చగా ఉండి కనుచూపు మేర పొలాలలో తలలూపుతూ చూడ ముచ్చటగా ఉంటాయి.ధాన్యం పంట నూర్చి కుప్పలు వేస్తే అవీ పచ్చగానే ఉంటాయి.

కోతలు అయిన తరువాత మిగిలే ఎండుగడ్డి కూడ బంగారు రంగే.
పొగమంచు ప్రభావం చేత సూర్యకాంతి కూడ లేత పసుపు రంగులోనే ఉంటుంది.
పొలాలలోను, తోటలలోను, అడవులలోను, కొండలమీద అలాంటి కొన్ని వందల, వేల మొక్కలు, చెట్లు వరుసగా ఉంటే ప్రకృతి అంతా బంగారు పూత పూసినట్టు కనిపిస్తుంది.
హేమం అంటే బంగారం. ప్రకృతి అంతా బంగారుమయంలా కనిపిస్తుంది కనుక ఈ ఋతువు హేమంత ఋతువు - బంగారం లాంటిది అని కవులు వర్ణిస్తారు.
మరొక పది రోజులలో ఈ ఋతువు మారిపోతుంది.

అతికొద్ది రోజులు మిగిలి ఉన్న ఈ ఋతువులో పొగమంచుని, చెట్లని, ఆకులని, పూలని, వాటి సొగసులని గమనించి ఆనందిద్దాం.

అద్భుతమైన సనాతన ప్రకృతి పరిశీలనా పద్ధతులకి, వాటిని మనకందించిన పెద్దలకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

స్వస్తి.

------------------------------------------“ “------------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

-------------------------------------

అందరికీ నమస్కారం.

ఇంగ్లీష్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **జనవరి నెల 30వ రోజు**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే చాంద్రమాన పద్ధతిలో

ఇది శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

హేమంత ఋతువు.

పుష్య మాసం.

కృష్ణ పక్షం.

పంచమి తిథి.

మంగళవారం.

ఉత్తర నక్షత్రం.

కుజుడికి భౌముడు, మంగళుడు అని కూడ పేర్లు ఉన్నాయి.

అందుచేత ఈ రోజుని మంగళవారం అని తెలుగులోను, భౌమవాసరం అని సంస్కృతంలోను అంటారు.

మన ఇంట్లో తెలుగు కాలెండర్ ఉండడం చాలా అవసరం.

కేవలం డేట్లు మాత్రమే ఉండే ఇంగ్లీష్ కాలెండర్ కాక, తెలుగులో తిథులు, నెలల పేర్లు వంటివి ఉండే కాలెండర్ ఉన్నదో లేదో చూడండి.

అది లేకపోతే మీ తల్లిదండ్రులని అడిగి ఒక తెలుగు కాలెండర్ కొనిపించండి.
రోజూ ఒకమాటు ఆ కాలెండర్ చూడడం అలవాటు చేసుకోండి.
మనకి తెలియని విషయాలెన్నో తెలుసుకోవచ్చు.పండుగలు ఎప్పుడు వస్తాయో తెలుస్తుంది.

మన సంస్కృతి తెలుసుకోవాలంటే అతి చిన్న ప్రయత్నం తెలుగు కాలెండర్ ఇంట్లో ఉంచుకోవడం, వీలైనంత తరచుగా దానిని చూడడం.ఎందుకంటే మన జీవన విధానం అంతా కాలెండర్ అంటే పంచాంగంతో ముడిపడి ఉన్నది.

మనం క్రమం తప్పకుండా రోజూ చేసే ఈ చిన్న ప్రయత్నం, వేల సంవత్సరాలుగా మనకి విజ్ఞానాన్ని అందిస్తున్న మన పూర్వీకులతో మనలని కలిపి ఉంచుతుంది.
అందరం దీనిని పాటిస్తామని ఆశిస్తున్నాను.

స్వస్తి.

---------------------------------------
2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే వివరాలు
---------------------------------------
ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.
పుష్యమాసంలో పాడ్యమి నుండి పంచమి వరకు అయిదు రోజులపాటు త్యాగరాజ ఆరాధనోత్సవాలు జరుపుకుంటారు.అవి ఈరోజుతో పూర్తి అవుతాయి.

ఈరోజు త్యాగరాజ స్వామి సమాధి స్థితిని పొందిన రోజు.
ఆయనని అభిమానించే సంగీత ప్రియులు అందరూ ఈ అయిదు రోజులలో త్యాగరాజ కీర్తనలను పాడడం, వీణ వయొలిన్ ఫ్లూట్ వంటి వాటిపై వాయించడం, కచేరీలు నిర్వహించడం చేస్తారు.

మన శరణ్య ఫైన్ ఆర్ట్స్ స్కూల్ లో కూడ ఈ ఉత్సవాలు క్రిందటి సంవత్సరాలలో జరుపుకున్నాం.

కర్ణాటక సంగీతంలో త్యాగరాజ స్వామి పేరు వినని వారు , త్యాగరాజ కీర్తనలు తెలియని వారు, పాడనివారు కూడ అరుదే.
అంత గొప్ప వాగ్గేయకారుడు, రామభక్తుడు త్యాగరాజు. నాదబ్రహ్మ అని ఆయనని సంభావిస్తారు.

ఈయన తెలుగువాడవడం తెలుగుజాతి అదృష్టం.
కర్ణాటక సంగీతానికి శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితర్, త్యాగరాజులను త్రిమూర్తులుగా భావిస్తారు.
వారి కీర్తనలు, స్వర కల్పన, కృషి మూలంగానే ఈ సంగీతం ఇంతగా ప్రాచుర్యం పొందింది.
మనం స్కూల్ లో నేర్చుకునే కీర్తనలలో త్యాగరాజ కృతులు కూడ ఉన్నాయి. మనకి సంగీతం, కీర్తనలు నేర్పే గురువుగారిని అడిగి అవి ఏవేవో తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

అద్భుతమైన సనాతన శాస్త్రీయ సంగీత పద్ధతులకి, వాటిని మనకందించిన పెద్దలకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజు తెలుసుకుంటూ ఉందాం.

స్వస్తి.

---------------------------------------------------“ “ ---------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

ఇంగ్లీష్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **జనవరి నెల 31వ రోజు**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే చాంద్రమాన పద్ధతిలో

ఇది శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

హేమంత ఋతువు.

పుష్య మాసం.

కృష్ణ పక్షం.

పంచమి తిథి.

బుధవారం.

హస్త నక్షత్రం.

బుధుడికి సౌమ్యుడు అని ఇంకొక పేరు.
అందుచేత ఈ రోజుని సౌమ్యవాసరం అని సంస్కృతంలో అంటారు.
సూర్యోదయాన్ని రోజు గమనిస్తున్నారనుకుంటాను.

ఈరోజు నుండి పగటి భాగం పెరగడం మొదలవుతుంది, రాత్రి భాగం తగ్గుతూ ఉంటుంది.
అంటే వేగం సూర్యోదయం అవుతూ ఉంటుంది, సూర్యాస్తమయం ఆలస్యం అవుతూ ఉంటుంది.

నిన్నటికంటె ఒక నిమిషం ముందుగా 6 గంటల 32 నిమిషాలకు సూర్యుడు ఉదయించాడు ఈరోజు.

సుమారుగా ప్రతి రెండు రోజులకు ఒక నిమిషం ముందుగా ఉదయిస్తూ ఉంటాడు ఇకనుండి ఈ ఉత్తరాయణం అంతా.

పంచాంగం తెలుసుకోవడం అంటే ప్రకృతిని పరిశీలించడమే.
మన చుట్టూ ఉండే వాతావరణాన్ని జాగ్రత్తగా గమనిస్తూ ఉందాం.
ప్రకృతిలో మార్పులకి తగినట్టు మన జీవన విధానాలని మార్చుకుందాం.

స్వస్తి.

--------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.
మన ఆశ్రమంలో ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ధ్యాన మందిరంలో గత 4 రోజులుగా అధ్యయన ఉత్సవాలు జరుగుతున్నాయి.
ఈరోజు 5వ రోజు - ఆ ఉత్సవాలకి ముగింపు.

ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ తరువాత వచ్చే హస్త నక్షత్రం నాటితో ముగిసే విధంగా ఈ అధ్యయన ఉత్సవాలు జరుగుతాయి.

వేదం సంస్కృత భాషలో ఉన్నది.
దానిలో ఉన్న విషయాలు అందరికీ సులభంగా తెలియాలని దక్షిణ దేశంలో ఆళ్వార్లు అనే గొప్ప భక్తులు తమిళ భాషలో 4000 పద్యాలు రాసారు.

తమిళంలో పద్యాన్ని పాశురం అంటారు.
అధ్యయన ఉత్సవాలలో ఆ 4000 పాశురాలని మంచి రాగయుక్తంగా చదువుతారు.
ఆ పాశురాలు వేంకటేశ్వర స్వామికి చాలా ఇష్టం.

నాలుగు వేదాలలో ఉన్న సారమంతా ఆ పాశురాలలో ఉన్నది.
ఈ 5 రోజులలో వేదం సారాంశం అంతా సులభంగా ఒకసారి చదవడం అయిందన్నమాట.

అవకాశం ఉన్నప్పుడు ఆ నాలుగువేల పాశురాలలో ఒకదానిని నేర్చుకున్నా వేదసారం ఇసుమంత తెలుసుకున్నవాళ్ళం అవుతాం.

అద్భుతమైన సనాతన అధ్యయన పద్ధతులకి, వాటిని మనకందించిన పెద్దలకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

స్వస్తి.

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

---------------------------------------

అందరికీ నమస్కారం.

ఇంగ్లీష్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 1వ రోజు**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే చాంద్రమాన పద్ధతిలో

ఇది శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

హేమంత ఋతువు.

పుష్య మాసం.

కృష్ణ పక్షం.

షష్ఠి తిథి.

గురువారం.

చిత్త నక్షత్రం.

దేవతల గురువైన బృహస్పతి పేరుమీదుగా ఈ రోజుని సంస్కృతంలో బృహస్పతి వాసరః అంటారు.

ఆయన గురువు కనుక మనం గురువారం అంటాం.

మరికొంతమంది ఈరోజు చాల శుభప్రదమైన రోజు కనుక లక్ష్మివారం అని కూడ అంటారు.

అలాగే వారాలలో మొదటిదైన Sunday ని ఆది వారం అంటాం.

కాని వాస్తవంగా ఆరోజును సూర్యుడి పేరు మీద భాను వాసరః అని అంటారు సంస్కృత భాషలో.

హిందీ మాట్లాడే ప్రాంతాలలో రవివార్ అంటారు.

తమాషా చూడండి ఇంగ్లీష్ లో కూడ సూర్యుడి పేరు మీదుగానే SUN day అంటారు - SUN అంటే సూర్యుడే కదా.

తక్కిన వారాల పేర్లు మరొకసారి తెలుసుకుందాం.

స్వస్తి.

---------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

---------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఇంగ్లీష్ కాలెండర్ అసలు పేరు గ్రెగోరియన్ కాలెండర్.

ఈ కాలెండర్ లో సంవత్సరాలకి పేర్లేవీ వుండవు.

జీసస్ క్రైస్ట్ జన్మించిన సంవత్సరం నుండి  1, 2, 3... అని లెక్కపెట్టి ఇప్పటికి 2024వ సంవత్సరం గడుస్తోంది అని చెబుతారు.

జీసస్ క్రైస్ట తరువాత జరుగుతున్న కాలమని Anno Domini అని అంటారు.

A.D. అనే అక్షరాలతో సూచిస్తారు.

ఇప్పుడు దీనినే common era అని కూడ అంటున్నారు.

C.E. అనే అక్షరాలతో సూచిస్తున్నారు.

Era అంటే తెలుగులో శకం అని అర్థం.

క్రీస్తు శకం 2024 వ సంవత్సరం అంటాం తెలుగులో.

క్రీస్తు జన్మించడానికి ముందు కాలాన్ని సూచించడానికి క్రీస్తు పూర్వం అంటాం.

బ్రిటిష్ వాళ్ళు మనని పరిపాలించడం మొదలై చాలా ఏళ్ళు గడిచిన తరువాత క్రీస్తు శకం అనే వాడకం వచ్చింది కాని అంతకు ముందు మనం ఇద్దరు మహాపురుషుల పేర్ల మీద రెండు శకాలను ప్రధానంగా వాడేవాళ్ళం.

ఆ మహా పురుషులు ఎవరో, వాటి వివరాలు ఏవో రేపు తెలుసుకొందాం.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన పెద్దలకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

స్వస్తి.

------------------------------------------“ “--------------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 2వ తేదీ**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే చాంద్రమాన పద్ధతిలో

ఇది శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

హేమంత ఋతువు.

పుష్య మాసం.

కృష్ణ పక్షం.

సప్తమి తిథి.

శుక్రవారం.

స్వాతి నక్షత్రం.

రాక్షసుల గురువైన శుక్రాచార్యుడి పేరుమీదుగా ఈ రోజుని శుక్రవారం అని అంటారు.

సంస్కృత భాషలో భృగు వాసరః అంటారు.

అలాగే

చంద్రుడికి సోమః, ఇందుః అని సంస్కృతంలో పేర్లు.

అందుచేత వారపు రోజులలో రెండవ రోజును తెలుగులో సోమవారం అని, సంస్కృతంలో ఇందు వాసరః అని అంటారు.

ఇంగ్లీష్ లో చంద్రుడిని Moon అంటాము కదా.
అందుచేత తమాషాగా Monday అంటారు సోమవారాన్ని Moonday అనే అర్థం వచ్చేటట్లు.

ఆదివారం సెలవుదినం అనే పద్ధతి మనకి బ్రిటిష్ వాళ్ళ పరిపాలన మొదలైన తరువాత వచ్చింది.

అంతకుముందు అలా ఉండేది కాదు.

విశిష్టమైన రోజులలోను, పండుగ రోజులలోను సెలవు పాటించేవారు.
వారం అంతా పనిచేస్తే ఒకరోజు సెలవు అనే నియమం ఉండేది కాదు.

ప్రజల అవసరాన్ని బట్టి, సంప్రదాయాన్ని బట్టి సెలవులు ఉండేవి.

ఇంకొక విషయం గమనించే ఉంటారు -
ఇంగ్లీష్ కాలెండరైనా, మన సంప్రదాయ పంచాంగమైనా వారంలో రోజుల సంఖ్య మారలేదు.
అందులోనూ ఇందులోనూ కూడ వారానికి ఏడు రోజులే.

ఇలాంటి ప్రత్యేకతలు తెలుసుకుంటూ ఉందాం.

స్వస్తి.

-------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే వివరాలు

--------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

నిన్నటి రోజున శకం అంటే ఏమిటో తెలుసుకున్నాం.

2024 సంవత్సరం అనే లెక్క క్రీస్తు శకం ప్రకారం అని కూడ తెలుసుకున్నాం.
మన సనాతన పద్ధతిలో ప్రస్తుతం శాలివాహన శకాన్ని అనుసరిస్తున్నాం.

శాలివాహనుడు అనే గొప్ప రాజు శత్రురాజులమీద సాధించిన విజయానికి గుర్తుగా శాలివాహన శకం ప్రసిద్ధి పొందింది.శాలివాహన శకం ప్రకారం ఇది 1945వ సంవత్సరం. అంటే శాలివాహనుడు దిగ్విజయం సాధించి ఇప్పటికి 1944 సంవత్సరాలు పూర్తి అయి 1945వ సంవత్సరం జరుగుతోంది అన్నమాట.

క్రీస్తుశకం 2024 సంవత్సరం కంటె 78 సంవత్సరాలు వెనుకగా ఉంటుంది శాలివాహన శకం లెక్క.

మనదేశంలో ఇంచుమించు 100-120 సంవత్సరాల క్రితం వరకు శాలివాహన శకాన్నే ఎక్కువగా వాడేవారు.

కేవలం మన దేశంలోనే కాదు south east asia లో చాలా దేశాలలో కూడ ఈ శాలివాహన శకం వాడుకలో ఉండేది.

ఇప్పటికీ కాంబోడియా అనే దేశంలో బౌద్ధమతస్థులు ఈ శకాన్ని వాడుతూ ఉంటారు.
ఈ శకాన్ని గురించి ఇంకొన్ని వివరాలు మరొకసారి తెలుసుకుందాం.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన పెద్దలకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజు తెలుసుకుంటూ ఉందాం.

స్వస్తి.

----------------------------------------------" "-----------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

---------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 3వ తేదీ**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే చాంద్రమాన పద్ధతిలో

ఇది శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

హేమంత ఋతువు.

పుష్య మాసం.

కృష్ణ పక్షం.

అష్టమి తిథి.

శనివారం.

విశాఖ నక్షత్రం.

నవ గ్రహాలలో ఒకటైన శనిగ్రహం పేరుమీదుగా ఈ రోజుని శనివారం అని అంటారు.
సంస్కృత భాషలో మంద వాసరః అని, స్థిరవాసరః అని కూడ అంటారు.

ఇంగ్లీష్ లో శనిని Saturn అంటారని మనకి తెలుసు. అందుచేత ఈరోజుని వారు Saturday అంటారు.

మిగిలిన వారాల పేర్లు కూడ మనం పిలిచే మంగళుడు, బుధుడు, బృహస్పతి, శుక్రుడు అనే వారికి జర్మన్ భాషలో గల పేర్లని బట్టి Tuesday, Wednesday, Thursday, Friday  అనేవి ఏర్పడ్డాయి.

ఆదివారం నుంచి శనివారం వరకు అన్ని రోజుల పేర్లు అన్ని భాషలలోను, ప్రపంచం అంతటా ఆకాశంలో సంచరించే గ్రహాలపేరుమీదుగానే ఒకేలాగ ఏర్పడడం ఆశ్చర్యమే.

ఇలా మనం పరిశీలనగా చూడడం మొదలుపెడితే ఇంకా చాలా చోట్ల ఇలాంటి సమానతలు కనిపిస్తాయి. వాటిని క్రమంగా అధ్యయనం చేద్దాం.

స్వస్తి.

--------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే వివరాలు

--------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

శాలివాహన శకం ప్రకారం ఇది 1945వ సంవత్సరం అని తెలుసుకున్నాం.

దేశ విదేశాలలో తన పేరుమీద ఏకంగా కాలమానంలో ఒక శకమే ప్రవర్తింపచేయబడే శాలివాహనుడు ఆంధ్రుడే అవడం మనకి గర్వ కారణం.

ఒక తెలుగు రాజు అంత మంచి పరిపాలకుడు గాను, పరాక్రమవంతుడు గాను చరిత్రలో నిలిచిపోయేంత గొప్పతనం సాధించాడు.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారత ప్రభుత్వం కూడ శాలివాహన శకాన్ని అధికారికమైన అంటే official కాలమానంగా ఆమోదించింది.

భారత ప్రభుత్వం వివిధ విషయాలలో G.O. విడుదల చేస్తూ ఉంటుందని మనం వింటూ ఉంటాం.

G.O. యొక్క full form Government Order అని.
దీనినే తెలుగులో రాజ శాసనం అంటారు.
ఇలాంటి శాసనాలన్నిటినీ ప్రతివారం భారత ప్రభుత్వం ఒక పత్రికలో ప్రకటిస్తుంది.

ఆ పత్రిక పేరు భారత రాజపత్రం. దానినే ఇంగ్లీష్ లో Gazette of India అని, ఆ ప్రకటనలని gazette notification అని అంటారు.

ఈ gazette లోను ఇంకా Government Order లలోను తేదీని వేసేటప్పుడు Gregorian calendar date తో పాటు శాలివాహన శకం ప్రకారం సంవత్సరం, నెల, రోజు కూడ వేస్తారు.

ఆధునిక యుగపు వేగంలో మన సంస్కృతి మనం మరిచిపోకుండా ప్రభుత్వం తీసుకున్న జాగ్రత్త ఇది.

మరి మనం కూడ మన సంస్కృతిని జాగ్రత్తగా చూసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ శకం గురించి ఇంకా మరికొన్ని విశేషాలు సోమవారం ముచ్చటిద్దాం.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, అది లోపించిపోకుండా కాపాడుతూ వస్తున్న మన ప్రభుత్వానికి, పెద్దలకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

స్వస్తి.

------------------------------------------“ “------------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 5వ తేదీ**.
మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే చాంద్రమాన పద్ధతిలో
ఇది శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.
ఉత్తరాయణం.
హేమంత ఋతువు.

పుష్య మాసం.
కృష్ణ పక్షం.
దశమి తిథి.
సోమవారం.
జ్యేష్ఠ నక్షత్రం.

సూర్యోదయం, సూర్యాస్తమయాలను గమనిస్తున్నారనుకుంటాను.
ఇప్పటి ఆధునిక పద్ధతుల ప్రకారం అర్ధరాత్రి 12 దాటగానే తేదీ మారిపోతుందని మనకి వాచీలన్నీ చూపిస్తున్నాయి.

కాని సనాతన భారతీయ పద్ధతిలో సూర్యోదయ సమయం తోటే రోజు ప్రారంభం అవుతుంది.

ఒక సూర్యోదయ సమయం నుండి మరునాడు సూర్యోదయ సమయం వరకు ఒక రోజుగా పరిగణిస్తాం.

ప్రకృతిలో జరిగే మార్పులను అనుసరించే పంచాంగం ఉంటుంది.
సూర్యోదయం అవబోతూ ఉంటే ప్రకృతి అంతా మేలుకొంటుంది.

పక్షులు నిద్రనుండి లేచి కిలకిలా రావాలు చేస్తాయి.
తూర్పు దిక్కున తెల్లని కాంతులు పరుచుకుంటాయి.
పగలు తిరిగే ప్రాణులన్నీ ఉత్సాహంతో సంచరించడం మొదలు పెడతాయి.
మానవులు సత్వగుణంతో ఇష్ట దేవతలకి నమస్కరించి తమ రోజువారీ కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

సాయంత్రం వరకు పనులు చేసుకొని రాత్రి కాగానే విశ్రాంతి తీసుకొని క్రమంగా నిద్రలోకి జారుకుంటారు.

మరల తెల్లవారుతూ ఉండగానే నిత్యకృత్యాలు మొదలుపెడతారు.
అందుకని ఈ దివా రాత్రుల చక్రాన్ని బట్టి సూర్యోదయం తోటే రోజు ప్రారంభమవుతుంది అని మన పెద్దవారు నిర్ణయించారు.

నమస్తే.

-------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

-------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

శాలివాహన శకం గురించి మనకి అనేకమంది రాజులు గత 1000 సంవత్సరాలుగా వేసిన రాజ శాసనాలద్వారా తెలుస్తోంది.

ఈ శాసనాలు ఇప్పటిలా కాగితాలమీద, కంప్యూటర్లలోను ఉండేవికాదు.

స్థిరంగా కొన్ని వందల సంవత్సరాలపాటు ఉండాలని రాగిరేకులమీద, రాళ్ళమీద అక్షరాలు చెక్కి శాసనాలు తయారుచేసేవారు.

ఫలాని వారి మాట శిలాశాసనం అనే నానుడి దీనినుండే బయలుదేరింది.

ఈ శాసనాలని అందరికీ అందుబాటులో ఉండి కనిపించే విధంగా దేవాలయాలలోను, నాలుగు వీధులు కలిసే కూడలిలోను, జయస్తంభాలమీద, పెద్ద పెద్ద కట్టడాలలోను, కోటగోడల మీద ఉంచేవారు.

మనం తిరుపతి వంటి పురాతన ఆలయాలకి వెళితే రాతి గోడలమీద వీటిని చూడవచ్చు.
ఆ లిపిని జాగ్రత్తగా చదివితే శాలివాహన శకం, నెల, తిథి తప్పక కనిపిస్తాయి.
అంత జాగ్రత్త తీసుకొని ముందుచూపుతో రాజులు శాసనాలు చెక్కించారు కనుక వారి గురించి, ఆనాటి కాలం గురించి మనకి తెలుస్తోంది.

మనలో చాలా మందికి రాయడం అంటే విసుగు, బద్ధకం.
మన పూర్వులు ఆ శాసనాలు రాసి ఉండకపోతే మనం వారి గురించి ఎలా తెలుసుకోగలం.
మనం మన సంగతులు రాయకపోతే మన తరువాతి వాళ్ళు మన గురించి ఎలా తెలుసుకోగలుగుతారు.
ఆలోచించండి.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, అది లోపించిపోకుండా భద్రపరిచిన పద్ధతులకి, పెద్దలకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

నమస్కారం.

-------------------------------------------“ “---------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు
------------------------------------
అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 6వ తేదీ**.
మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతి ప్రకారంశాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానంలో ఇది శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.
ఉత్తరాయణం.
హేమంత ఋతువు.
పుష్య మాసం.
కృష్ణ పక్షం.
ఏకాదశి తిథి.
మంగళవారం.
మూల నక్షత్రం.

కార్తెల గురించి ఇంతకుముందు తెలుసుకున్నాం.

సూర్యుడు ఏ నక్షత్రం దగ్గరగా ఉన్నట్టు తెలుస్తుందో ఆ కార్తె అని అంటారు.
నిన్నటివరకు శ్రవణా నక్షత్రంలో ఉన్న సూర్యుడు ఈరోజు ధనిష్ఠ నక్షత్రంలో ప్రవేశిస్తాడు.

ఈరోజునుండి ధనిష్ఠ కార్తె ప్రారంభం.
కార్తెలను బట్టి ప్రధానంగా వ్యవసాయ పనులు చేసుకొనేవారు అని తెలుసుకున్నాం.
సంక్రాంతి పండుగకి పంటలన్నీ ఇంటికి చేరుకొనేవి.

ఆ తరువాత రైతులు ధాన్యాన్ని ఇంట్లో భద్రపరుచుకోవడం, దానిలో కొంత భాగం అమ్మి ధనం రూపంలో మార్చుకోవడం, ఆ ధనంతో ఇంటికి కావలసిన వస్తువులు కొనడం, శుభకార్యాలు, పుణ్యకార్యాలు చేయడం వంటి పనులు చేసేవారు.

ఒకరకంగా పొలం పనులకు కాస్త విరామం ఇచ్చేవారు.
అందుకని ఈ 5-6 కార్తెలలోను ప్రత్యేకమైన సూచనలు ఏవీ ఉండవు.

నమస్తే.

--------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే వివరాలు

--------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఈ రోజు ఏకాదశి.

తిథులు అన్నిటిలోకి ఉత్తమమైన తిథి ఏకాదశి తిథి అంటారు.
ఏకాదశినాడు కోవిలకి వెళ్ళి దైవదర్శనం చేసుకోవడం, ఉపవాసం చేయడం, భగవత్ స్మరణ, జాగరణ, భజనలు, నామసంకీర్తనలు వంటివి చేస్తారు.

ఏకాదశినాడు చేసే జప తపాలు, ధ్యానాలు మామూలు రోజులలో కంటే అధిక ఫలాన్ని ఇస్తాయని చెబుతారు.

ప్రతి మాసం లోను రెండు సార్లు వస్తుంది ఏకాదశి తిథి. ఒకసారి శుక్లపక్షం లోను, ఇంకొకసారి కృష్ణ పక్షం లోను.

ఇలా 15 రోజులకి ఒకసారి చొప్పున సంవత్సరానికి 24 సార్లు వస్తుంది.

ఒక్కొక్క ఏకాదశికి ఒక్కొక్క ప్రత్యేకతని చెబుతాయి శాస్త్రాలు. దానిని బట్టి ప్రతి ఏకాదశికి ఒక ప్రత్యేకమైన పేరు ఉంటుంది.

ఈ నాటి ఏకాదశికి షట్ తిల ఏకాదశి అని పేరు.
తిలలు అంటే నువ్వులు.

అవి ఉపయోగించి ఈ రోజు కొన్ని పుణ్య కార్యాలు చేయాలి కనుక ఈ ఏకాదశికి షట్ తిల ఏకాదశి అని పేరు వచ్చింది.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన పెద్దలకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

-----------------------------------------------“ “----------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే వివరాలు

-------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 7వ తేదీ**.
మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం.
చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

హేమంత ఋతువు.

పుష్య మాసం.

కృష్ణ పక్షం.

ద్వాదశి తిథి.

బుధవారం.

పూర్వాషాఢ నక్షత్రం.

చంద్రుడు అసలు కనిపించని సమయం అమావాస్య తిథి.

చంద్రుడు పూర్తిగా కనిపించే సమయం పౌర్ణమి తిథి.
పౌర్ణమి అమావాస్యల మధ్య 14 రోజులపాటు క్రమంగా ఎంతెంత భాగం కనిపిస్తూ ఉంటాడో అవి పాడ్యమి నుండి చతుర్దశి వరకు గల తిథులు.

చంద్రుడు భూమి చుట్టూ తిరగడం, భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ కూడ తిరగడం వలన తిథి స్థిరంగా 24 గంటలపాటు ఉండదు.

ఒకసారి 26 గంటలు ఉండవచ్చు, ఒకసారి 19 గంటలు ఉండవచ్చు.

మనం కాలండర్ చూసినప్పుడు తిథి ఆరోజు ఎన్ని గంటలవరకు ఉన్నదో ఆ సమయాన్ని సూచిస్తారు.

ఉదాహరణకు ఈరోజు ద్వాదశి తిథి ఉదయం 10 గంటల 48 నిమిషాల వరకు ఉన్నది.
ఆ తరువాత త్రయోదశి తిథి వస్తుందని తెలుసుకోవాలి.

సూర్యోదయం అయే సమయానికి ఏ తిథి ఉన్నదో దానినే ఆ రోజు యొక్క తిథిగా పరిగణిస్తారు.

నమస్తే.

-------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

-------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

శాలివాహన శకం లాగే ఉత్తర భారతదేశంలో ఎక్కువ ప్రాంతాలలో వాడుకలో ఉన్నది విక్రమార్క శకం.

దీనిసే విక్రమ్ శకం అని కూడ అంటారు.
విక్రమాదిత్యుడు లేదా విక్రమార్కుడు అనే గొప్ప చక్రవర్తి పేరుమీద ఈ శకం ప్రవర్తితమవుతోంది.  భట్టి విక్రమార్క కథలలో ఈ చక్రవర్తి గొప్ప సాహస గాథలు ఈనాటికీ మనం చదువుకుంటూనే ఉన్నాం.

భేతాళ కథలలో అసాధారణమైన తెలివితేటలతో సమస్యకి పరిష్కారం చెప్పే విక్రమాదిత్యుడే ఈ శక పురుషుడు.

విక్రమార్క సింహాసనం అని, విక్రమార్కుని ఖడ్గం అని ఇలా ఆయనకి చెందిన వస్తువులు గొప్ప మహిమ కలవి అని పేరు.

ఈ విక్రమార్క శకం క్రీస్తుశకం కంటె 57 సంవత్సరాలుముందే ప్రారంభమయింది.
ధర్మానికి కట్టుబడి పరిపాలన చేయడం చేత ఈయన పేరు 2000 సంవత్సరాల తరువాత కూడ ప్రజలందరూ ఇష్టంగా ఆరాధనా భావంతో గుర్తుపెట్టుకుంటున్నారు.

అటువంటి మంచి లక్షణాలను మనం కూడ అలవరచుకొని అందరూ మెచ్చే విధంగా ప్రవర్తించాలి.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని నిలబెట్టిన యుగపురుషులకి, పెద్దలకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.
అందరికీ నమస్కారం.

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 8వ తేదీ**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం.  శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

హేమంత ఋతువు.

పుష్య మాసం.

కృష్ణ పక్షం.

త్రయోదశి తిథి.

గురువారం.

ఉత్తరాషాఢ నక్షత్రం.

తిథి ఎంతసేపు ఉంటుందనేది ప్రతిరోజు మారుతుందని, సూర్యోదయ సమయానికి ఏ తిథి ఉన్నదో దానినే ఆరోజు యొక్క తిథిగా పరిగణిస్తారని తెలుసుకున్నాం.

అదేవిధంగా చంద్రుడు ఒక్కొక్క నక్షత్రంతోపాటు ప్రయాణించినట్టు కనిపించే సమయం కూడ ప్రతిరోజు మారిపోతూ ఉంటుంది.

కొన్ని నక్షత్రాలతో ఎక్కువసేపు, కొన్ని నక్షత్రాలతో తక్కువసేపు ఉంటుంది చంద్రుడి గమనం.

సూర్యోదయ సమయానికి చంద్రుడు ఏ నక్షత్రంతో కూడి ఉన్నాడో దానినే ఆరోజు యొక్క నక్షత్రంగా పరిగణిస్తారు.

ఈ ఎక్కువ తక్కువలకి కారణం చంద్రుడు భూమిచుట్టూ తిరగడానికి పట్టే రోజులు 27 అవడం, భూమి చంద్రుడు తిరిగే కక్ష్యలలో ఉండే తేడా వగైరాలు.

కాలెండర్ చూసినప్పుడు ఆరోజు నక్షత్రం ఎంతవరకు ఉన్నదో కూడ సూచిస్తారు.
ఉదాహరణకి ఈ రోజు ఉత్తరాషాఢ రా.1.49 అని రాసి ఉంటుంది.

అంటే నిన్న రాత్రి మొదలై ఈరోజు పగలంతా ఉండి అర్ధరాత్రి దాటాక 1.49 AM వరకు ఉత్తరాషాఢ ఉన్నదనమాట.

ఆ తరువాత శ్రవణం నక్షత్రం.
పంచాంగం కాలెండర్ రోజూ చూడడం అలవాటుగా పెట్టుకోండి.

నమస్తే.

---------------------------------------
2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే వివరాలు
---------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.
ఈరోజు మాస శివరాత్రి. శివుడికి ఇష్టమైన రోజు.
మాస శివరాత్రి అంటే ప్రతినెల, నెలకి ఒకమారు వచ్చే శివరాత్రి.

మాఘమాసంలో శివరాత్రిని మహా శివరాత్రి అంటారు - ఆ రోజు పరమశివుడు ఉద్భవించిన రోజు అంటే పుట్టినరోజు అనవచ్చు.

శివభక్తులు ప్రతి మాసంలోను శివుడి పుట్టినరోజును ప్రీతితో జరుపుకుంటారు.
ఉదయంనుండి ఉపవాసం ఉండి రాత్రి శివాలయాలలో దీపారాధన చేస్తారు.
అర్చన జరుపుతారు.

పురాణాలు, పుణ్యకథలు పండితులు చెప్పగా వింటారు.

దేవతలని పూజించడానికి అన్నిరోజులూ సరియైనవే అయినా కొన్ని ప్రత్యేకమైన రోజులలో విశేష ఫలితం ఉంటుంది.

మన పుట్టినరోజున ఎవరైనా birthday wishes చెప్తే మనకి ఎక్కువ సంతోషం కదా.
అలాగే ఈ పర్వదినాలు కూడ.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, పర్వదినాల ద్వారా దానిని మనకి అందించిన పెద్దలకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.
-----------------------------------------------“ “-------------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు
----------------------------------------
అందరికీ నమస్కారం.
గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 9వ తేదీ**.
మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం.శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.
ఉత్తరాయణం.
హేమంత ఋతువు.
పుష్య మాసం.
కృష్ణ పక్షం.
చతుర్దశి, అమావాస్య తిథులు రెండూ ఈరోజే.
శుక్రవారం.
శ్రవణం నక్షత్రం.

ఈ రోజు అనేక విశేషాలు ఉన్నాయి.

సూర్యోదయం అయిన తరువాత చతుర్దశి తిథి కొంతసేపటి వరకే ఉన్నది.
ఆ తరువాత అమావాస్య ప్రారంభమై రేపు తెల్లవారు జాము లోపల అంతమైపోతున్నది.
రేపు సూర్యోదయానికి అమావాస్య లేదు.

భూమి, చంద్రుల గమనంలో వచ్చే తేడాలవలన ఇలా జరుగుతుంది. అందుకని చతుర్దశి, అమావాస్య తిథులు రెండూ ఈరోజే పాటించాలి.

రెండు రోజుల క్రితమే సూర్యుడు ధనిష్ఠ నక్షత్రంలోకి ప్రవేశించేడని, ఇది ధనిష్ఠ కార్తె అనుకున్నాం కదా.

ఈ రోజు రాత్రి నుండి చంద్రుడు కూడ ధనిష్ఠ నక్షత్రంలో ప్రయాణిస్తాడు.
అందుకనే మనకి చంద్రుడు కనిపించడు, అమావాస్య అవుతుంది.

నమస్తే.

--------------------------------------
2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు
--------------------------------------
ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.  ఈరోజు చొల్లంగి అమావాస్య.
పుష్యమాసంలో వచ్చే అమావాస్యని చొల్లంగి అమావాస్య అని మన రాష్ట్రంలో అంటారు.
ఇతర రాష్ట్రాలలో దీనిని మౌని అమావాస్య అంటారు.
చాలా గొప్ప పర్వదినం.

గోదావరి నది ఏడు పాయలుగా చీలి సముద్రంలో కలుస్తుంది.
ఆ ఏడుపాయలలో ఒకటైన తుల్యభాగ అనే పాయ చొల్లంగి దగ్గర సముద్రంలో కలుస్తుంది.
మన స్కూలు పక్కనుండే ప్రవహిస్తుంది.

ఈరోజు కొన్ని వేల మంది ప్రజలు ఈనది సముద్రంలో కలిసే చోట పుణ్య స్నానాలు చేస్తారు.
ఈరోజు నుంచి సప్త గోదావరి యాత్ర చేస్తారు.

అంటే గోదావరి ఏడు పాయల సముద్ర సంగమాలకి వెళ్ళి అక్కడ పుణ్య స్నానాలు చేస్తారు.
ఉత్తర భారతదేశంలో గంగ, యమున వంటి పుణ్యనదులలో కొన్ని లక్షలమంది పుణ్యస్నానాలు చేస్తారు.

వారికి ఈ మౌని అమావాస్య అతి పవిత్రమైనది.
దక్షిణ భారతదేశంలో తిరువళ్ళూర్ అనే పుణ్యక్షేత్రంలో ఉన్న వైద్య వీరరాఘువ నారాయణుడిని ఆరాధించి చలిమిడితో దీపాలు వెలిగిస్తారు.

ఇలా దేశమంతటా పవిత్రంగా భావించే రోజు ఈరోజు.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, పర్వదినాల ద్వారా దానిని మనకి అందించిన పెద్దలకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజు తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.
-----------------------------------------“ “----------------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే వివరాలు
--------------------------------------
అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 10వ తేదీ**.
మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.
ఉత్తరాయణం.
శిశిరఋతువు.
మాఘ మాసం.
శుక్లపక్షం.

పాడ్యమి తిథి.
శనివారం.
ధనిష్ఠ నక్షత్రం.

ఒక్కరోజు తేడాలో ఋతువు, మాసం, పక్షం అన్నీ మారిపోయాయి నిన్నటికీ, ఈరోజుకీ.

ప్రకృతిలో మార్పులు కొన్నిసార్లు అలా హఠాత్తుగానే ఉంటాయి. కాలం అంతా ఒకేలా ఉండదు, ఎవరికోసం ఆగదు.

కాలం మనకి అనుకూలంగా ఉన్నప్పుడే పనులు చక్కబెట్టుకోవాలి అని పెద్దలు చెబుతారు.

Make hay while Sun shines అని ఇంగ్లీషులో నానుడి.

ఏదయితేనేం తెలుగు సంవత్సరపు చివరి ఋతువులోకి ప్రవేశించేము.
నిన్నటితో కృష్ణపక్షం, పుష్యమాసం, హేమంత ఋతువు పూర్తి అయినాయి.

ఈరోజునుండి రెండు నెలలు శిశిర ఋతువు.
ఈ శిశిరఋతువు ప్రధానమైన లక్షణం చెట్లు ఆకురాల్చడం, తిరిగి కొత్తగా చిగుర్లు వేయడానికి తమని తాము సిద్ధం చేసుకోవడం.
మరికొన్ని వివరాలు మరొకరోజు తెలుసుకుందాం.

నమస్తే.

---------------------------------------
2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు
---------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

శాలివాహన, విక్రమార్క శకాలగురించి తెలుసుకున్నాం.

ఇలాంటిదే ఇంకొక ప్రసిద్ధమైన శకం యుధిష్ఠిరశకం.

పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు అసలు పేరు యుధిష్ఠిరుడు.

అతడు ఎప్పుడూ ధర్మాన్ని తప్పకపోవడం వలన యమధర్మరాజు కుమారుడవడం వలన కూడ ధర్మరాజు అనే పేరు వచ్చింది.

పాండవుల ధైర్య సాహసాలు, వారి ధర్మ ప్రవర్తన మన అందరం కథలుగా ఈనాటికీ చదువుకుంటున్నాం.

మహాభారతం అనే పెద్ద ఇతిహాసమే బయలుదేరింది వారి చరిత్రను చెప్పడానికి. అలాంటి ధర్మరాజు పరిపాలన కోసం ప్రజలు ఎంతగానో ఎదురు చూసి, ఆ పరిపాలనలో అత్యంత సుఖసంతోషాలను పొందారు.

ధర్మరాజు అంటే యుధిష్ఠిరుడు పరిపాలన ప్రారంభించిన సంవత్సరాన్ని చాలా ప్రీతిగా గుర్తుపెట్టుకుని అక్కడినుండి ఇన్ని సంవత్సరాలు గడిచేయి అని లెక్కపెట్టేవారు. దానిసే యుధిష్ఠిర శకం అంటారు.

ఈ యుధిష్ఠిర శకం ప్రారంభమైన తరువాత ఇప్పటికి అయిదువేల సంవత్సరాల పైగానే దాటిపోయాయి. అయినా ఈ నాటికీ అక్కడక్కడ ఈ శకం వాడుకలో ఉన్నది.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, యుగపురుషులైన మన పూర్వులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 12వ తేదీ**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

శిశిరఋతువు.

మాఘ మాసం.

శుక్లపక్షం.

తదియ తిథి.

సోమవారం.

పూర్వాభాద్ర నక్షత్రం.

చంద్రుడిని గమనిస్తున్నారా!

ఇది శుక్ల పక్షం!

సూర్యాస్తమయం అయిన తరువాత చంద్రుడు రేఖామాత్రంగా పడమటి ఆకాశంలో కనిపిస్తాడు.

చంద్రుడు దినదినం తన పరిమాణాన్ని పెంచుకుంటూ లోకమంతా చల్లగా వెలుగు నిండి ఉండేటట్లు చూస్తాడు.

ఎవరికైనా ఆశీస్సులు అందజేసినప్పుడు, ఎవరైనా కొత్తగా విద్య నేర్చుకోవడమో, ఉద్యోగంలో చేరడమో, వ్యాపారం ప్రారంభించడమో చేసినప్పుడు వారికి శుభాకాంక్షలు చెప్తాము.

శుక్ల పక్ష చంద్రుడిలా నువ్వు దినదినాభివృద్ధి చెందాలి అని ఆకాంక్షిస్తాము.

మన చుట్టూ ఉన్న ప్రకృతిని గమనిస్తూ, అనుభూతి చెందుతూ, అందరితో పంచుకోవడమే పంచాంగం గురించి తెలుసుకోవడంలో అంతరార్థం.

నమస్తే.

-------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

-------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.
శాలివాహన, విక్రమార్క, యుధిష్ఠిర శకాలగురించి తెలుసుకున్నాం.
మనదేశంలో మరొక ప్రసిద్ధమైన శకం నాగార్జున శకం.

నాగార్జునుడు ఆయన కాలంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రసిద్ధమైన తత్త్వ శాస్త్రవేత్త, ప్రవక్త, ఆచార్యుడు, పరిశోధకుడు, విద్యావేత్త.

బౌద్ధమతం మనదేశంలోను, ఇతరదేశాలలోను బాగా వ్యాప్తి చెందడానికి ఈయనే మూలకారణం.

మహారాజులతో సహా అసంఖ్యాకమైన ప్రజలు వీరిని అనుసరించేవారు.
శాలివాహనుడి వంశ రాజులు కూడ ఈయనవలన ప్రభావితమైనవారే.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అభివృద్ధి చేసినది ఈయనే.
ఈ మహనీయుడు ఆంధ్రుడే అవడం మనకి గర్వకారణం.

అంతటి గొప్ప ఆచార్య నాగార్జునుడిని  మాటిమాటికీ ప్రీతితో గుర్తు చేసుకోవడానికి వీలుగా ఆయన పేరుమీద ఒక శకాన్నే ప్రవర్తింపచేసారు మన పూర్వులు.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, యుగపురుషులైన మన పూర్వులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.
అందరికీ నమస్కారం.

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

---------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 13వ తేదీ**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం

చాంద్రమానం శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

శిశిరఋతువు.

మాఘ మాసం.

శుక్లపక్షం.

చవితి తిథి.

మంగళవారం.

ఉత్తరాభాద్ర నక్షత్రం.

క్రిందటినెల సంక్రాంతి పండుగ జరుపుకున్నాం.

సంక్రమణం అన్నా సంక్రాంతి అన్నా ఒకటే.

సంక్రమణం అంటే పొందుట, ప్రవేశించుట అని అర్థం.

సూర్యుడు ఒక రాశి నుండి మరొక రాశిలోకి ప్రవేశించడాన్ని సంక్రమణం లేదా సంక్రాంతి అంటారు.

జనవరి నెలలో వచ్చిన సంక్రాంతి పండుగ నాడు సూర్యుడు మకరరాశిలో ప్రవేశించాడు.

దానిని పెద్ద పండుగా జరుపుకోవడం ఆనవాయితీ.

ఈరోజు సూర్యుడు మకర రాశినుండి కుంభ రాశిలోకి ప్రవేశిస్తాడు.

అందుకే ఈ రోజును కుంభ సంక్రమణం లేదా కుంభ సంక్రాంతి అంటారు.

నమస్తే.

-------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే వివరాలు

-------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం. ఈ రోజు మన అందరికీ అతి విశేషమైన రోజు. మన ఈ స్కూలును శ్రీ స్వామీజీ ఫిబ్రవరి 13వ తేదీ నాడే ప్రారంభించారు, 2011వ సంవత్సరంలో. సరిగ్గా 13 సంవత్సరాలు పూర్తి అయి 14వ సంవత్సరంలో ప్రవేశిస్తున్నాం.

ఈరోజు మన శరణ్య స్కూల్ వార్షికోత్సవం అన్నమాట. సంవత్సరానికి సంస్కృతంలో ఇంకొక పేరు వర్షం. వర్షానికి ఒకమారు చేసుకొనే ఉత్సవం వార్షికోత్సవం.

2011లో శరణ్య స్కూల్ లో ప్లే క్లాస్ లో జాయిన్ అయిన విద్యార్థులే ఇప్పుడు 10వ తరగతి పూర్తి చేసుకుంటున్నారు.

ఇన్ని సంవత్సరాలుగా విద్యార్థులపైన ఉపాధ్యాయులపైన తమ అనుగ్రహాన్ని నిరంతరం వర్షిస్తున్న శ్రీ స్వామీజీ ఆరాధించే శ్రీ వైకుంఠనారాయణ పెరుమాళ్ళకు అనేక విధాలుగా మన అందరి తరఫున కృతజ్ఞతలు తెలుపుకుంటూ శ్రీ స్వామివారు విశాఖపట్టణంలో బ్రహ్మయజ్ఞం నిర్వహిస్తున్నారు.

ఎంతో ప్రేమతోను, భక్తితోను, ప్రీతితోను నిర్వహించబడే అపురూపమైన వైదిక కార్యక్రమం ఈ బ్రహ్మయజ్ఞం.

బ్రహ్మయజ్ఞాన్ని మించిన వార్షికోత్సవం ఏముంటుంది కనుక!

అవకాశం చేసుకొనైనా సరే ఒకమాటైనా మనం ఈ యజ్ఞాన్ని దర్శించుకుందాం. అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన పూర్వులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

---------------------------------------------“ “----------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

-------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 14వ తేదీ**.
మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం

శిశిరఋతువు

మాఘ మాసం

శుక్లపక్షం

పంచమి తిథి

బుధవారం

రేవతి నక్షత్రం

కాలచక్రం అనేమాట విన్నారా?
సైకిల్ చక్రం చూసారు కదా - అది తన చుట్టూ తాను తిరుగుతూ ఉంటుంది, ముందుకి కూడ వెళుతూ ఉంటుంది.

కాలం అనేది కూడ అంతే. వారాలు ఏడు, పక్షాలు రెండు, నెలలు పన్నెండు, ఋతువులు ఆరు, నక్షత్రాలు 27 - ఒకదాని తరువాత ఒకటిగా మళ్ళా మళ్ళా అవే వస్తూ ఉంటాయి - సైకిల్ చక్రం తన చుట్టూ తాను తిరిగినట్టు. ఇంగ్లీష్ లో రొటేటింగ్ అంటారు.

శకం అనేది అనంతమైన కాలంలో ఏదో ఒక హద్దు పెట్టుకొని అక్కడినుండి ఎన్ని సంవత్సరాలు అయిందో లెక్కపెట్టుకోవడం కాలంలో ముందుకు వెళ్ళడం, సైకిల్ చక్రం ముందుకి వెళ్ళి కొంత ప్రయాణం చేసినట్టు.

ఇంగ్లీష్ లో రివాల్వింగ్ అంటారు.

అలాంటి కాలచక్రంలో నక్షత్రాలు ఇరవై ఏడింటిలో చివరిదైన రేవతి నక్షత్రం ఈరోజు.

నమస్తే.

-------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే వివరాలు

-------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఈరోజు అంటే మాఘమాసంలో శుక్లపక్షంలో వచ్చే పంచమీ తిథిని వసంత పంచమి అంటారు.

మిక్కిలి శుభాలను కలిగించే రోజు. ఏ పనినైనా ప్రారంభించవచ్చు, ముహూర్తం చూడనవసరం లేదని అంటారు.
ఈ రోజు సరస్వతీ దేవి పుట్టినరోజు లేదా ఆమెకు బాగా ప్రీతికరమైన రోజు అంటారు. విద్యారంభం, అక్షరాభ్యాసం వంటివి చేస్తారు.

ఈరోజుకి శ్రీ పంచమి, మదన పంచమి అని కూడ పేర్లున్నాయి.
ఒడిస్సా, వెస్ట్ బెంగాల్, బీహార్ వంటి రాష్ట్రాల్లో బాగా ఉత్సవం జరుపుకుంటారు.

ఈరోజున ఏది ప్రారంభించినా దిగ్విజయం అని ప్రజల నమ్మకం.

మన స్కూల్ 12వ తరగతి విద్యార్థులు వారి ఫైనల్ పరీక్షల admit cards ఈరోజే తీసుకోబోతున్నారు. వారికి మన శుభాకాంక్షలు తెలియజేద్దాం.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన పూర్వులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

--------------------------------------------------“ “--------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

---------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 15వ తేదీ**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

శిశిరఋతువు.

మాఘ మాసం.

శుక్లపక్షం.

షష్ఠి తిథి.

గురువారం.

అశ్విని నక్షత్రం.

మాఘమాసం అంటే చంద్రుడు పౌర్ణమి నాడు  మఖ నక్షత్రంతో కలిసి ఉన్న మాసం. ఈరోజు అశ్విని నక్షత్రం.  మరో తొమ్మిది రోజులలో మఖ నక్షత్రం వస్తుంది. ఈరోజు షష్ఠి తిథి అంటే ఈ మాసం ప్రారంభమై 6వరోజు. మరో తొమ్మిది రోజులలో పౌర్ణమి తిథి.

నక్షత్రం ప్రకారం లెక్కించినా, తిథి ప్రకారం లెక్కించినా పౌర్ణమి నాటికి మఖ సరిపోతోంది. ఇలాగే పంచాంగ గణన చేసుకుంటూ, తాము సరిగ్గా లెక్కిస్తున్నామా అని సరి చూసుకుంటూ వెళతారు సిద్ధాంతులు.

మనం కూడ కాగితం, కలం, కాలిక్యులేటర్ వంటివాటి అవసరం లేకుండా మనస్సులోనే లెక్కించే నేర్పు, గుర్తు ఉంచుకొనే ధారణ శక్తి సాధించాలి. అప్పుడే మన సిద్ధాంతాలను నిలబెట్టగలం.

నమస్తే.

--------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

మాఘమాసం సూర్యుడికి ప్రియతమమైన మాసం అని ప్రతీతి.
ఈ నెల మొదలుకొని 5 నెలలను మాఘాది పంచకం అంటారు.
మాఘ మాసం మొదలుకొని అయిదు మాసాలు అని అర్థం.
అన్ని శుభ, పుణ్య కార్యాలు ఇప్పుడు చేయడం శ్రేష్ఠం అంటారు.

వివాహాలు, ఉపనయనాలు, దేవాలయ ప్రతిష్ఠలు, ఉత్సవాలు, యజ్ఞాలు వంటివి ఈ సమయంలోనే చేస్తారు.సరియైన సమయంలో చేసిన పనులు సత్ఫలితాలను ఇస్తాయి.

ఈ 5 నెలల కాలం మంచి ముహూర్తాలన్నీ ఉంటాయి కనుక పైన చెప్పిన కర్మలు అన్నిటికీ ఇది సరియైన సమయం.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన పూర్వులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

------------------------------------------“ “--------------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు  2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 16వ తేదీ**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

శిశిరఋతువు.

మాఘ మాసం.

శుక్లపక్షం.

సప్తమి తిథి.

శుక్రవారం.

భరణి నక్షత్రం.

ఉత్తరాయణం ఎప్పుడు ప్రారంభం అయిందో గుర్తుందా?
మకర సంక్రాంతి లేదా పెద్ద పండుగ రోజున ప్రారంభం అయింది.
ఉత్తరాయణం అంటే సూర్యుడు ఉత్తరం వైపు ప్రయాణించడం అని కద అనుకున్నాం.
సూర్యుడి రథం ఉత్తరం వైపు ప్రయాణించడం ఈరోజునుండి స్పష్టంగా తెలుస్తుందట.
అందుకని ఈరోజుని రథసప్తమి అంటారు.

వాతావరణం కాస్త వేడిగా మారుతుంది ఈరోజు నుంచి.  ఉదయం ఇంకా చిన్న చలి, మంచు ఉంటాయి. శిశిరం అంటే చల్లనిది అని అర్థం.

కాని Global Warming వలన ఋతువుల సహజ స్వభావాలు మారిపోతూ ఉండడం వలన వాతావరణ మార్పులని పూర్తిగా అనుభవించలేకుండా ఉన్నాము.
దానికి పరిష్కారాలను కనుగొనే బాధ్యత మన అందరిదీ.
నమస్తే.

--------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

మాఘమాసంలో శుక్ల పక్షంలో వచ్చే సప్తమి తిథిని రథ సప్తమి అంటారు.

మాఘమాసం మొత్తం సూర్యుడికి ఇష్టమైన మాసమని అందులోనూ ఆదివారం అతి ప్రియమని, రథ సప్తమి ఇంకా ప్రీతి అని అంటారు.

సూర్య నమస్కారాలు చేసేవారు, సూర్య స్తోత్రాలు చదివేవారు, సూర్య సంబంధమైన మంత్రాలు చదివేవారు ఈరోజున వాటన్నిటితోను సూర్యుడిని ఆరాధిస్తారు.

'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్' అనే శ్లోక వాక్యం సూర్య ఉపాసన వలన ఆరోగ్యం కలుగుతుంది అని చెబుతుంది.

సూర్యుడు ధర్మరాజుకి అక్షయంగా అన్నాన్ని ఇచ్చే పాత్రని ఇచ్చాడు, హనుమంతుడికి సకల విద్యలు ప్రసాదించాడు, యాజ్ఞవల్క్య మహర్షికి శుక్ల యజుర్వేదాన్ని ఉపదేశించాడు.

శ్రీరామచంద్రమూర్తికి అగస్త్య మహర్షి ఆదిత్యహృదయ  స్తోత్రాన్ని ఉపదేశించగా దానిని జపించి రావణాసురుని మీద యుద్ధంలో విజయం సాధించాడు.

సూర్యమండల మధ్యస్థుడైన శ్రీమన్నారాయణ మూర్తిని ధ్యానిస్తే సద్బుద్ధి కలుగుతుంది అని మన పూర్వులు చెప్పిన మాట.

ప్రతినిత్యం సూర్యునికి మూడు సంధ్యలలోను నమస్కరించాలని పెద్దల నియమం.

వేదమంత్రాలలో అతి ప్రసిద్ధిగాంచిన గాయత్రీమంత్రం సూర్యమండల అంతర్గతుడైన భగవంతుని గురించే.

ఇంకా సూర్యుని గురించి అనేకమైన విషయాలను చెప్పే అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన పూర్వులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.  అందరికీ నమస్కారం.

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

---------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 17వ తేదీ**.
మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

శిశిరఋతువు.

మాఘ మాసం.

శుక్లపక్షం.

అష్టమి తిథి.

శనివారం.

కృత్తిక నక్షత్రం.

ఆకాశంలో చంద్రుడిని గమనిస్తూ ఉన్నారా?
సాయంత్రం నుండి కనిపిస్తూనే ఉన్నాడు. ప్రకాశవంతంగానే ఉన్నాడు, రోజు రోజుకి పరిమాణంలో పెద్దగా అవుతున్నాడు.

నిన్న రాత్రి, మొన్న రాత్రి కూడ చంద్రుడి పక్కనే ఒక నక్షత్రం కూడ కనిపించింది.
బాగా కాంతివంతంగా ఉన్నది.

తారలాగ కనిపించినా అది నిజానికి గురు గ్రహం.
Planet Jupiter అంటారు ఇంగ్లీషులో.

నిన్న భరణి నక్షత్రం కదా అంటే చంద్రుడు భరణి దగ్గర ఉన్నాడు.
అదే భరణి దగ్గర గురుడు కూడ ఉన్నాడు.  అందుచేత పక్కపక్కనే కనిపించారు.
గ్రహాలను, నక్షత్రాలను పరిశీలిస్తూ ఉంటే చాలా ఆశ్చర్యకరంగా ఉంటుంది.

అది ఒక పెద్ద విజ్ఞాన శాస్త్రం - Science.

అందరం కొంతైనా ఆ విజ్ఞానాన్ని సంపాదించే ప్రయత్నం చేద్దాం.
నమస్తే.

-------------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే వివరాలు

-------------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఈరోజుని భీష్మాష్టమి అంటారు.

మహాభారతంలో కౌరవులకి, పాండవులకి పితామహుడు - పెద్ద తాతగారు.
భారత యుద్ధాన్ని పదిరోజులపాటు నడిపించి చివరకు ఆయుధాలు విడిచిపెడతాడు.
యుద్ధభూమిలో బాణాలతోటే శయ్య ఏర్పాటు చేస్తే దానిమీదనే సుమారు రెండు నెలలు గడుపుతాడు.

తాను కోరుకున్నప్పుడు మరణించగలిగే వరం ఉండడం చేత ఉత్తరాయణ పుణ్యకాలం, శుభప్రదమైన మాఘమాసం, రథసప్తమి కూడ గడిచాక అష్టమి నాడు శ్రీకృష్ణ భగవానుడు ఎదురుగా నిలబడి ఉండగా ఆయనను సేవిస్తూ ప్రాణం విడిచిపెడతాడు.

అందుకనే ఈ రోజును భీష్మాష్టమి అంటారు.
తాను చేసిన ప్రతిజ్ఞ కోసం తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు.
మహాభారతంలో గొప్ప పాత్ర ఈయనదే. ఆయన లోకానికి చేసిన మహోపకారం గురించి ఇంకొక రోజు తెలుసుకుందాం.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన పూర్వులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.
అందరికీ నమస్కారం.

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 19వ తేదీ**.
మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

శిశిరఋతువు.

మాఘ మాసం.

శుక్లపక్షం.

దశమి తిథి.

సోమవారం.

మృగశిర నక్షత్రం.

ఇంతవరకు మనం యుధిష్ఠిర, విక్రమార్క, నాగార్జున, శాలివాహన శకాలగురించి తెలుసుకున్నాం.

ఇటువంటిదే ఇంకొక శకం విజయాభినందన శకం.

ఈ శకం గురించిన వివరాలు ఇప్పుడు పెద్దగా తెలియడం లేదు.
ఈ శక పురుషుడు ఎవరో, శకం ఎందుకు ప్రారంభమైందో, ఎప్పుడు ప్రారంభించారో తెలియడం లేదు.

కేవలం భగవంతుని కల్యాణం జరిగేటప్పుడు చదివే మంత్రాలలో మాత్రం వినబడుతుంది అంతే.

కాలగర్భంలో కలిసిపోయింది. అంటే క్రమంగా అందరూ మరిచి పోయినట్టు అయిపోయింది.

మన ఇళ్ళల్లోనూ అంతేకదా!

మహా అయితే మన ముత్తాత గారి గురించి తెలుస్తుంది. మరి వారికి తండ్రిగారు, తాతగారు, ముత్తాత గారు ఉండేవారు కదా, వారందరూ ఎలా ఉండేవారు? ఏమి చేసేవారు? ఎంత గొప్పవారు?

ఇవన్నీ తెలుసుకోవడమే చరిత్ర చదువుకోవడం.

అదే మన జీవనానికి పునాది.

దానిని నిలబెట్టడానికి ఒక ఫ్రేమ్ లా ఉండేదే కాలగణన, పంచాంగ విజ్ఞానం.

మరికొన్ని వివరాలు రోజూ తెలుసుకుంటూ ఉందాం.

నమస్తే.

---------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

---------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

మన భారతదేశం యొక్క గొప్పతనమంతా వేదాంత విజ్ఞానంతో ముడిపడి ఉన్నది.

దానిని గత వేయి సంవత్సరాలలో బాగా ప్రజలలోకి వ్యాప్తి చేసినవారు ప్రధానంగా ముగ్గురు ఆచార్యులు.

వారు శ్రీ శంకర భగవత్పాదులు, భగవద్ రామానుజాచార్యులు, శ్రీ మధ్వాచార్యులు.

వీరు ముగ్గురినే త్రిమతాచార్యులు అనికూడ అంటారు.

వారిలో మూడవ వారైన మధ్వాచార్యులవారు సమాధిని పొందిన రోజు నిన్నటి రోజు.

దానిని మధ్వ నవమి అంటారు.

ఎక్కువగా కర్ణాటక, రాయలసీమ ప్రాంతాలలో మధ్వులు భక్తి శ్రద్ధలతో వారి ఆచార్యులని ఆరాధిస్తారు.

అలాగే

భగవద్రామానుజాచార్యులవారికి గురుతుల్యులైన కాంచీపూర్ణులు అనే మహాత్ముల పుట్టిన రోజు ఈరోజు. వారు భగవంతునితో నేరుగా మాట్లాడగలిగేంత మహాభక్తులు అని శ్రీవైష్ణవులు అందరూ ఈరోజున వారిని గుర్తుచేసుకుంటారు.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన పూర్వులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

--------------------------------------------“ ”-----------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 20వ తేదీ**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

శిశిరఋతువు.

మాఘ మాసం.

శుక్లపక్షం.

ఏకాదశి తిథి.

మంగళవారం.

ఆరుద్ర నక్షత్రం.

కార్తెల గురించి గుర్తుందనుకుంటాను.

సూర్యుడు ఒక్కొక్క నక్షత్రంతోపాటు ప్రయాణించే కాలాన్ని ఆ నక్షత్రపు కార్తె అంటారు. నిన్నటివరకు ధనిష్ఠ నక్షత్రంలో ఉన్న సూర్యుడు ఈరోజు శతభిషం నక్షత్రంలో ప్రవేశిస్తాడు.

ఈరోజునుండి సుమారు 13 రోజులు శతభిష కార్తె.

మన శరణ్య స్కూల్ గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం 2011 ఫిబ్రవరి 13వ తేదీన ప్రారంభం అయింది అనుకున్నాం కదా.

తెలుగు పంచాంగం ప్రకారం వికృతి అనే పేరు గల సంవత్సరం, మాఘ మాసం, శుక్లపక్షం, దశమి తిథి, ఆదివారం, రోహిణి నక్షత్రం నాడు ప్రారంభం అయింది.

అంటే నిన్నటికి తెలుగు పంచాంగం ప్రకారం కూడ 13 సంవత్సరాలు పూర్తి అయి 14వ సంవత్సరం ప్రారంభం అయింది.

నమస్తే.

--------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే వివరాలు

--------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఈరోజు భీష్మ ఏకాదశి.

పాండవులలో పెద్దవాడైన ధర్మరాజుకి అతని తాతగారైన భీష్ముడు శ్రీకృష్ణ భగవానుడి సమక్షంలో శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రాన్ని ఉపదేశించాడు.

మహాభారత సారం ఈ స్తోత్రం.

భీష్ముడు చెప్పగా వేదవ్యాస మహర్షి దానిని లోకంలో వ్యాప్తి చేసిన రోజు ఈరోజు.
అందుకే ఈరోజుని శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర జయంతి అంటారు.

మనదేశంలో కొన్ని కోట్లమంది ప్రజలు అన్ని ప్రాంతాలలోను పారాయణ చేసే ఈ స్తోత్రాన్ని
మన O C T క్లాసులలో శ్రద్ధగా నేర్చుకుందాం.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన పూర్వులకి నమస్కరించి
ఆయా విశిష్టతలు ప్రతిరోజు తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

----------------------------------------------" "----------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే వివరాలు

---------------------------------------

అందరికీ నమస్కారం.
గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 21వ తేదీ**.
మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం
చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.
ఉత్తరాయణం.
శిశిరఋతువు.
మాఘ మాసం.
శుక్లపక్షం.
ద్వాదశి తిథి.
బుధవారం.

పునర్వసు నక్షత్రం.

ఈరోజు మనకి సూర్యోదయం 6 గంటల 25 నిమిషాలకి అయింది.
విశాఖపట్టణంలో 6.21కే సూర్యోదయం, మన కంటె 4 నిమిషాలు ముందు.

కోల్కత్తాలో 6.05కి
మణిపూర్ రాష్ట్రంలో 5.45కి

అంటే తూర్పు దిక్కుకి వెళ్ళేకొద్దీ సూర్యోదయం వేగం అవుతోంది.
పడమటి దిక్కుకి వెళ్ళేకొద్దీ ఆలస్యంగా ఉదయిస్తాడు సూర్యుడు.

హైదరాబాద్ లో 6.40కి
ముంబాయిలో 7.04కి

గుజరాత్ లోని జామ్ నగర్ లో 7.18కి సూర్యోదయం.

అంటే తూర్పున ఉన్న మణిపూర్ లో 5.45కి బయలుదేరితే 3400 కిలోమీటర్లు ప్రయాణించి భారతదేశం పడమటి తీరానికి 93 నిమిషాల తరువాత చేరుకుంటాడు సూర్యుడు.

సూర్యోదయ సమయాన్ని బట్టే కదా పంచాంగంలో తిథులు, లగ్నాలు, ముహూర్తాలు నిర్ణయిస్తారు.

పంచాంగంలో మనం తిథి, నక్షత్రం ఎంతవరకు ఉన్నాయో చూసేటప్పుడు, ఆ పంచాంగం ఏ ప్రాంతం కోసం రాయబడిందో చూడాలి.

దానిని బట్టి మనం ఉన్న ప్రాంతానికి తిథులు, నక్షత్రాల సమయాలలో ఎంత టైమ్ adjust చేయాలో చూసుకోవాలి.

మీరందరూ తెలుగు పంచాంగం రోజూ చూస్తున్నారా! ఇంకా చూడకపోతే ఇప్పుడైనా ప్రారంభించండి.

నమస్తే.

--------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఈరోజు భీష్మ ద్వాదశి.

నిన్నటి దినం శ్రీ విష్ణు సహస్రనామ జయంతి.

ఆ స్తోత్రాన్ని ఉపదేశించిన ఆచార్యుడు భీష్ముడు. కౌరవులకి, పాండవులకి పెద్ద తాతగారు. ఆయన చేసిన ఈ ఉపకారానికి గుర్తుగా ఆయనని స్మరించుకుంటారు ఈరోజు.
మహాభారత యుద్ధం జరిగిన కురుక్షేత్రం హర్యానా రాష్ట్రంలో ఉంది.

అక్కడే భీష్మకుండ్ అనే చోట భీష్ముడు అంపశయ్య మీద ప్రాణాలు విడిచిన ప్రదేశం, విష్ణు సహస్ర నామ స్తోత్రం చెప్పిన ప్రదేశం, మరికొంత దూరంలో శ్రీకృష్ణుడు అర్జునునికి భగవద్గీత ఉపదేశించిన ప్రదేశం వంటివి ఉన్నాయి.

నిన్న ఏకాదశి మొదలుకొని 5 రోజులు ఉత్తర భారత దేశం అంతటా భీష్మపంచక వ్రతం అని పవిత్రమైన రోజులుగా వ్రతం చేస్తారు.

అందులో భాగంగా ఈరోజు భీష్మునికి, పితృదేవతలకి ప్రత్యేకమైన పూజలు జరుపుతారు.

పెద్దలను తరతరాలుగా గుర్తు చేసుకోవడం, వారు చూపిన మార్గాన్ని అనుసరించడమే మనం వారికి అర్పించగలిగే నివాళి.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన పూర్వులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

--------------------------------------------“ “-----------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 22వ తేదీ**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

శిశిరఋతువు.

మాఘ మాసం.

శుక్లపక్షం.

త్రయోదశి తిథి.

గురువారం.

పుష్యమి నక్షత్రం.

అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తి 'రామ్ లల్లా' ఆలయం ప్రతిష్ఠ జరిగి ఇవాళకి సరిగ్గా నెల రోజులు పూర్తి అయి రెండవ నెల ప్రారంభమయింది ఇంగ్లీష్ కాలెండర్ ప్రకారం.

తెలుగు పంచాంగంలో తిథుల ప్రకారం నిన్నటికే నెల రోజులు పూర్తి అయిపోయింది.

కూర్మ ద్వాదశి నాడు కదా ప్రతిష్ఠ జరిగింది!

ఈ తేడా ఎందుకు వచ్చిందో ఆలోచించండి?

మీరు శ్రద్ధగా పంచాంగ వివరాలు వింటూ ఉంటే తప్పక చెప్పగలరు.

మీ క్లాసులలో తెలుగు ఉపాధ్యాయులకి చెప్పండి, లేదా వారిని అడిగి తెలుసుకోండి.

నమస్తే.

--------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే వివరాలు

--------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

మన శ్రీ జీయర్ స్వామివారు విశాఖపట్టణంలో గత 12 రోజులుగా చేస్తున్న బ్రహ్మయజ్ఞం ఈ రోజుతో పూర్తి అవుతుంది.

ప్రతిరోజు కొన్ని వేలమంది దర్శనం చేసుకున్నారు.

ప్రతిరోజు ఉదయం సుదర్శన హోమం, నారాయణ, వాసుదేవ, విష్ణు మంత్రాల హవనాలు జరిగాయి.

నాలుగు వేదాలు, రామాయణం, దివ్య ప్రబంధం పారాయణ చేసారు ఋత్విక్కులు.

భక్తులందరూ శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రం, భగవద్గీత సామూహికంగా పారాయణ చేసారు ప్రతిరోజు మూడు గంటలపాటు.

సాయంత్రం భగవంతుని కల్యాణం జరిగింది ప్రతిరోజు.

రోజూ 108మంది భక్తులు చందనం తీసి శ్రీకృష్ణునికి సమర్పించారు.

మరొక 108 మంది పొడవైన పూలమాలలు తయారుచేసి శ్రీకృష్ణునికి అలంకరించారు.

అన్నిరోజులు కలిపి ఇంచుమించు ఒక లక్ష అన్న ప్రసాదాలు అందరికీ పంచిపెట్టారు.

మన శ్రీ జీయర్ స్వామివారు అన్నిరోజులు నిరంతరం ధ్యాన దీక్షలో, వీలైనంత మౌనం పాటిస్తూ, ఏకాగ్రతతో శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణ చేస్తూ అందరికీ తీర్థం ఇచ్చారు రమారమి ఉదయం 3 గంటలసేపు, సాయంత్రం 3గంటలసేపు.

మహావైభవంగా జరిగింది 12 రోజులుగా.

అందరికీ శుభం కలిగించే ఈ బ్రహ్మయజ్ఞం ఈరోజు మధ్యాహ్నం పూర్ణాహుతితో పూర్తి అవుతుంది.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందిస్తున్న మన శ్రీస్వామివారికి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజు తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

-------------------------------------------“ “-----------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే వివరాలు

-------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 23వ తేదీ**.
మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం
చాంద్రమానం శోభకృత్ అనే పేరుగల సంవత్సరం
ఉత్తరాయణం
శిశిరఋతువు

మాఘ మాసం

శుక్లపక్షం

చతుర్దశి తిథి

శుక్రవారం

ఆశ్లేష నక్షత్రం

ఈరోజుకి మనం అసెంబ్లీలో పంచాంగం వివరాలు తెలుసుకోవడం ప్రారంభించి నెల రోజులు అయింది.

తిథి ప్రకారం నిన్నటితోనే అయిపోయింది.
పుష్య శుక్ల త్రయోదశినాడు ప్రారంభించాం జనవరి 23న.

నమస్తే

------------------------------------“ “--------------------------------------------------------------

అందరికీ నమస్కారం.
గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 24వ తేదీ**.
మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

శిశిరఋతువు.

మాఘ మాసం.

శుక్లపక్షం.

పౌర్ణమి తిథి.

శనివారం.

మఖ నక్షత్రం.

ఈరోజు పౌర్ణమి కదా! నిండు చంద్రుడు సాయంత్రం అవగానే ఉదయించి రాత్రంతా ఆకాశంలో కనువిందు చేస్తాడు.

పౌర్ణమి నాటికి మఖ నక్షత్రం దగ్గర చంద్రుడు ఉంటాడు కనుక ఈ మాసాన్ని మాఘ మాసం అన్నారు.

ప్రతి పౌర్ణమికి ప్రకృతి అంతా పులకిస్తుంది చంద్ర కిరణ స్పర్శతో.

మన శాస్త్రాల ప్రకారం చంద్రుడు ఓషధులకి, మూలికలకి అధిపతి.

ఓషధులు అంటే మనకి ఆరోగ్యాన్ని కలిగించే మొక్కలు, చెట్లు, పొదలు, లతలు వగైరా.

అవి అన్నీ పౌర్ణమినాడు తమ తమ శక్తులను పుంజుకుంటాయి.

తన చల్లని కాంతితో అందరి మనస్సులకి హాయిని కలుగజేస్తాడు కనుక అమృతకిరణుడు అంటారు చంద్రుడిని.

కొంతసేపైనా చంద్రుడిని చూడండి, చంద్రుడిలా అందరినీ ఆనందింపచేసే అమృతమయమైన మనస్సుని పొందండి.

నమస్తే

-----------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఈరోజు మాఘ పౌర్ణమి.

మహామాఘి అని కూడ అంటారు.

గంగానది వంటి పుణ్యనదులలో పవిత్ర స్నానాలు చేస్తారు.

ఇష్టదైవాన్ని పూజిస్తారు.

దానధర్మాలు చేస్తారు.

చేయకూడని పనులను చేసినదానికి ప్రాయశ్చిత్తంగాను, ఎప్పుడూ మంచి పనులే చేయాలనీ కూడ ఇటువంటి పుణ్యకార్యాలు చేస్తారు.

కార్తీకమాసం దీపారాధనలకి ప్రసిద్ధి పొందినట్టు మాఘమాసం అంతా పుణ్య నదీ స్నానాలకి ప్రసిద్ధి.

ఒక్కొక్క మాసంలో ఒక్కొక్క ప్రత్యేకత ఏర్పాటు చేసారు మన మహర్షులు.

వారి లక్ష్యం అంతా ప్రజలందరూ మంచి మనస్సులు కలిగి ఉండాలి, మంచి పనులు చేయాలి, మంచిగా మాట్లాడాలి తద్వారా సమాజం అంతా సుఖశాంతులు వెల్లివిరియాలి అని.

అద్భుతమైన అటువంటి సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన మన పూర్వులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజు తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

-----------------------------------------" "-----------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 26వ తేదీ**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం.

చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

శిశిరఋతువు.

మాఘ మాసం.

కృష్ణపక్షం.

విదియతిథి.

సోమవారం.

ఉత్తర నక్షత్రం.

నిన్నటి నుండి కృష్ణపక్షం ప్రారంభమైంది. దీనినే బహుళ పక్షం అని కూడ అంటారు. చంద్రుడు కనబడే సమయం, పరిమాణం కూడ రోజురోజుకూ క్రమంగా తగ్గుతూ అమావాస్య నాటికి పూర్తిగా కనబడకుండా అయిపోతాడు.

వాతావరణంలో కూడ మార్పు గమనిస్తూ ఉన్నారా!
ఉదయపు పొగమంచు ఇంచుమించుగా తగ్గిపోయింది.
మంచు పడడం మాత్రం ఇంకా కొద్దిగా ఉన్నది.
సమశీతోష్ణంగా ఉంటున్నాయి పగళ్ళు, రాత్రులు.

సముద్రతీరానికి దగ్గరగా ఉన్న ప్రాంతాలలో ఒకలాగ, బాగా లోపలికి ఉన్న ప్రాంతాలలో ఇంకోలాగ, కొండలలో మరొకలాగ ఉంటుంది వాతావరణం ఈ శిశిర ఋతువులో.

శిశిరం అంటే చల్లనిది అనే అర్థం ఉన్నా, భూతాపం (global warming) పెరగడం వలన ఋతువుల ధర్మాలు ముందుగా చెప్పలేకుండా  మారుతున్నాయి.

ప్రకృతిని మనం రక్షించుకుంటే ప్రకృతి మన మనుగడకి వీలు కలిగిస్తుంది. లేకపోతే దుర్భరం చేస్తుంది.

మనం చేయవలసినదల్లా ప్రకృతిని ప్రేమించడం, దానిని రక్షించడం.

అది ఎలాగో క్రమంగా రాబోయే రోజుల్లో తెలుసుకుందాం.

నమస్తే.

---------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

---------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఈరోజు విదియ తిథి.

విదియ తదియలు, దశమి ఏకాదశులు జంట తిథులుగా పరిగణిస్తారు.

రెండు మంచి రోజులు వరుసగా ఉన్నాయి కనుక అలా అంటారు.

మంచిపనుల ప్రారంభానికి, శుభముహూర్తాల నిర్ణయానికి ఈ తిథులని ఎక్కువగా ఎంచుకుంటారు.

సూర్యుడికి ప్రీతికరమైన మాఘమాసం మొదటి సగం గడిచి రెండవ సగం లోకి ప్రవేశించాం.

ఈ మాసంలో సూర్య నమస్కారాలు చేయడం, ఆదిత్య హృదయం చదవడం వంటివి శరీరానికి, మనస్సుకి కూడ బలాన్నిస్తాయని చెబుతారు.

అలాంటి మంచిపనులు ప్రారంభం చేద్దాం ఈరోజు.  మన స్కూల్ లో కొన్ని తరగతులవారు ఆదిత్యహృదయం నేర్చుకుంటున్నారు. దానిని మరిచిపోకుండా నిత్యకృత్యంగా పెట్టుకుంటే జీవితం సుఖమయంగా ఉంటుంది.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన మన పూర్వులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజు తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

----------------------------------------" "---------------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 27వ తేదీ**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం.

చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

శిశిరఋతువు.

మాఘ మాసం.

కృష్ణపక్షం.

తదియతిథి.

మంగళవారం.

హస్త నక్షత్రం.

రోజు తెల్లవారుజామునే నిద్రలేవాలి అని పెద్దవాళ్ళు చెబుతారు.

తెల్లవారుజాము అనే పదాన్ని కాస్త ఛాందసంగా తెల్లవారుఝాము అనికూడ అంటారు.

యామం అనే పదానికి వికృతి పదం జాము.

యామం లేదా జాము అనేది కాలాన్ని తెలిపే ఒక విభాగం.

గంట, నిమిషం, సెకను ఎలాగైతే కాలాన్ని తెలిపే విభాగాలో యామం లేదా జాము కూడ అలాగే కాలాన్ని తెలుపుతుంది.

ఒక రోజుకి 8 యామాలు లేదా జాములు.అంటే ఒక్కొక్క జాము సుమారు 3గంటల కాలం ఉంటుందనమాట. కోడిపుంజు ప్రతి జాముకి ఒకసారి కూస్తుందని ప్రతీతి.

మనం జాగ్రత్తగా ప్రతిరోజు వింటే కోడిపుంజులు సమయం ప్రకారమే కూస్తాయని గమనించగలం.

పశుపక్ష్యాదులకి గంటలు, నిమిషాలు తెలిపే గడియారాల సంగతి తెలియదుకదా.

వాటికి సూర్యుడు, ప్రకృతే ఆధారం. ఆ ప్రకారమే అవి తమ ప్రవృత్తిని మార్చుకుంటాయి.

కాలాన్ని తెలపడానికి ప్రకృతిలో ఉండే ఇలాంటి సంకేతాలనే ఆధారం చేసుకునే వారు మన ముందు తరాలవారు.

ఇంకా కనుచీకటి ఉండగానే కోడి కూతతోనే మేల్కొనేవారు. జాము మారిందని తెలపడానికి నగారాలు కాని భేరీలు కాని గంటలు కాని మ్రోగించేవారు.

కాలాన్ని ఇంకా ఎలా కొలిచేవారో మరికొన్ని వివరాలు రాబోయే రోజులలో తెలుసుకుందాం.

నమస్తే.

---

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఎవరైనా మనకి సాయం చేస్తే వారిపట్ల మనం కృతజ్ఞత చూపిస్తాం కదా.

వారిని ఆదరంగా పలకరించడం, గౌరవంగా చూడడం, ప్రీతితో వారికి ఏదైనా ప్రత్యుపకారం చేయడం, వారి బాగోగులు కనుక్కోవడం, వారికి ఏ అవసరం కలిగినా అది చేయడానికి సిద్ధపడడం ఇలాంటి పనులు మనం చేస్తూ ఉంటాం.

అలా మనకి చేసిన సాయం చాలా పెద్దది అయితే వారికి ఋణపడి ఉన్నామని అంటాం.

సాయం చేసినవారిని 'మీరు దేముడిలా ఆదుకున్నారు' అని అంటాం.

ఈ భూమి, నీరు, గాలి, సూర్యుడు, చంద్రుడు, ఆకాశం, సముద్రం, పర్వతాలు, నదులు ఇవన్నీ మనం జీవించడానికి ప్రాణాధారమైన వాతావరణం కల్పిస్తున్నాయి కదా.

వీటిలో ఏది లేకపోయినా మానవ జాతి కాని ప్రాణికోటి కాని జీవించలేదు. అంత అతి ముఖ్యమైన ఉపకారాన్ని తమ స్వార్థం ఏమీ లేకుండా చేస్తున్న వాటిపట్ల కృతజ్ఞతని చూపించడం, వాటిని దైవ స్వరూపాలుగా భావించడం మన పెద్దలు మనకి నేర్పిన సంస్కృతి.

జన్మనిచ్చిన తలిదండ్రులని ఎలా ప్రేమిస్తామో జీవనానికి ఆధారమైన ప్రకృతిని కూడ అలా ప్రేమించడమే మనం వాటికి చేయగలిగే ప్రత్యుపకారం.

అది ఎలా ఉండాలో తెలిపే అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన పూర్వులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

------------------------------------------------“ “---------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 28వ తేదీ**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

శిశిరఋతువు.

మాఘ మాసం.

కృష్ణపక్షం.

చవితితిథి.

బుధవారం.

చిత్త నక్షత్రం.

యామం లేదా జాము గురించి నిన్న కొంత తెలుసుకున్నాం.

రోజుకి 8 జాములు - ఒక్కొక్కటి 3 గంటలు.

3 జాములపాటు కేవలం రాత్రి మాత్రమే ఉంటుంది.

అందుకనే రాత్రికి త్రియామా అని కూడ పేరు.

పగటికాలాన్ని 5 విభాగాలు చేసారు ఆయా సమయాల్లో చేయాల్సిన పనులని బట్టి.

మొదటిది ప్రాతఃకాలం, రెండవది సంగవ కాలం, మూడవది మధ్యాహ్న కాలం, నాల్గవది అపరాహ్ణకాలం, అయిదవది సాయంకాలం.

ఋతువులని బట్టి, మానవులు చేపట్టే వృత్తులని బట్టి, వారి వయస్సులని బట్టి ఏసమయంలో ఏ పనులు చేయాలో నిర్ణయించారు.

ప్రకృతి అంతటినీ చైతన్యవంతం చేసే సూర్యుడిని ప్రత్యక్ష దైవంగా భావిస్తారు మన దేశంలో ప్రజలు.

ప్రాతఃకాలంలో సూర్యుడికి అర్ఘ్యం ఇస్తారు ఏవయస్సువారైనా, ఏప్రాంతం వారైనా, ఏ వృత్తివారైనా.

అర్ఘ్యం అంటే పూజకి ఉపయోగించే పరిశుద్ధమైన జలం.

అదే మనం ప్రకృతి పట్ల కృతజ్ఞత వ్యక్తం చేయగలిగే మొదటి పని.

మన పెద్దలు ఆచరించిన ఇటువంటి ధర్మాలను మనం కూడ అనుసరిద్దాం.

నమస్తే.

-----------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే వివరాలు

-----------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఇవాళ National Science Day.

1928వ సంవత్సరం ఫిబ్రవరి 28వ తారీకున మన దేశానికి చెందిన సర్ సి.వి.రామన్ అనే గొప్ప శాస్త్రవేత్త 'Raman effect' కనుగొన్నందుకు గాను ప్రతి సంవత్సరం ఈరోజును జాతీయ విజ్ఞానశాస్త్ర దినంగా జరుపుకుంటున్నాము.

ఆయన పరిశోధనకి ప్రపంచం వెంటనే 1930లో నోబెల్ బహుమతి ఇచ్చి గౌరవించింది. జ్ఞానంలోను, విజ్ఞానంలోను కూడ మన దేశం ప్రపంచానికే తలమానికంగా ఉండేది పదిహేనువందలు - రెండువేల సంవత్సరాల క్రితం.

ఏరంగంలోనైనా మేధావులు, నిష్ణాతులు అసంఖ్యాకంగా ఉండేవారు. విద్య నేర్చుకోవడానికి మన దేశానికే వచ్చేవారు. అనేక కారణాల వలన క్రమంగా లోపించిన ఆ విజ్ఞానాన్ని తిరిగి సంపాదించడానికి అనువైన కాలం మళ్ళా ఇప్పుడు లభించింది. మన అందరం ఏదైనా ఒక శాస్త్రంలో పాండిత్యం సంపాదించాలని, మానవ జాతిని ముందుకు నడిపే సైంటిస్టులం అవాలని మన శ్రీ జీయర్ స్వామివారి ఆశయం. వారి ఆశయాన్ని సాధించడానికి ఈరోజునుండే ప్రయత్నిద్దాం.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన పూర్వులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.
అందరికీ నమస్కారం.

-----------------------------------------" "----------------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే వివరాలు

---------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **ఫిబ్రవరి నెల 29వ తేదీ**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

శిశిరఋతువు.

మాఘ మాసం.

కృష్ణపక్షం.

పంచమితిథి.

గురువారం.

చిత్త నక్షత్రం.

అంతర్జాతీయ కాలమానం ప్రకారం రోజుకి ఇరవై నాలుగు గంటలు, గంటకి అరవై నిమిషాలు, నిమిషానికి అరవై సెకన్లు.

మన ప్రాచీన కాలమాన పద్ధతిలో రోజుకి అరవై ఘడియలు.
అంటే ఒక ఘడియ ఇప్పటి ఇరవై నాలుగు నిమిషాలకి సమానం.

ఘడియకే దండ, నాడి అని కూడ పేరు. దీనినే సంస్కృతంలో ఘటీ అంటారు.
ఒక ఘడియకి అరవై విఘడియలు.
అంటే ఒక విఘడియకి ఇరవై నాలుగు సెకన్లు.
విఘడియకి వినాడి, పల అని కూడ పేర్లు. దీనినే సంస్కృతంలో విఘటీ అంటారు.
పంచాంగ గణన అంతా ఘడియ, విఘడియలలోనే జరుగుతుంది.
ఒక ఏభై సంవత్సరాల క్రితం వరకు పంచాంగాలన్నీ తెలుగు అంకెలతో ఘడియ, విఘడియలతోనే ఉండేవి.
అందరికీ తెలిసే వ్యావహారిక కాలమానంలో ఉండాలని ఘడియ, విఘడియలతో పాటు గంటలు, నిమిషాలలో కూడ పంచాంగంలో కాలాన్ని సూచించడం మొదలుపెట్టారు సిద్ధాంతులు.

అటువంటి పంచాంగాన్ని గంటల పంచాంగం అనేవారు.
క్రమంగా వాటికి జనాదరణ పెరగడంతో ఇప్పుడు అన్ని పంచాంగాలు గంటల పంచాంగాలే లభిస్తున్నాయి.

ప్రాచీనమైన మన కాల గణనని విడిచిపెట్టకూడదనే నియమాన్ని నమ్మిన సిద్ధాంతులు కొంతమంది మాత్రం ఇప్పటికీ తమ పంచాంగాలలో గంటలతోపాటు, ఘడియ విఘడియలను తెలుగు అంకెలతో సూచిస్తున్నారు.

సనాతన పద్ధతులను ఆచరిస్తూనే ఆధునిక విధానాలను ఆదరిస్తున్న వారి కృషిని మనం అందరం అభినందించాలి, ప్రోత్సహించాలి.
నమస్తే.

---

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే వివరాలు

--------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.
ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి వచ్చేరోజు ఈరోజు.
భూమి సూర్యుడి చుట్టూ తిరగడానికి మూడువందల అరవై ఐదు రోజుల కన్నా ఒక పావువంతు రోజు ఎక్కువగా పడుతుంది కనుక నాలుగు సంవత్సరాలకి ఒకసారి ఫిబ్రవరి నెలకి ఒకరోజు కలిపి ఇరవై తొమ్మిది రోజులుగా నిర్ధారించారు.
ఫిబ్రవరిలో లీప్ డే - అధికంగా వచ్చే దినం ఈరోజు.
మనం సంప్రదాయంగా అనుసరించేది చాంద్రమానం.
చంద్రుడి గమనాన్ని బట్టి నెలకి ముప్పై తిథులు.
తిథి పరిమాణం పంథొమ్మిది నుండి ఇరవై ఆరు గంటలు ఉంటుంది అని తెలుసుకున్నాం.
అందుచేత సంవత్సరానికి మూడువందల అరవై రోజుల కన్నా కొద్దిగా తక్కువగా వస్తాయి పంచాంగ గణనలో.

ఈ తేడాని కలుపుకోవడానికి చాంద్రమానంలో అధికమాసం - లీప్ మంత్ - ఏర్పాటు చేసారు.

అది సుమారు మూడు సంవత్సరాలకి ఒకసారి వస్తుంది.
అందుకనే చాంద్రమానం ప్రకారం వచ్చే ఉగాది వంటి పండుగలు ఇంగ్లీష్ కాలెండర్ ప్రకారం ప్రతిసంవత్సరం ఒకే తేదీన కాకుండా వేరువేరు తేదీలలో వస్తాయి.

అధికమాసం వచ్చే సంవత్సరంలో దానిని గురించి మరింత తెలుసుకుందాం.
అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన పూర్వులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే వివరాలు

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **మార్చి నెల 1వ తేదీ**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం. శిశిరఋతువు. మాఘ మాసం. కృష్ణపక్షం.

షష్ఠి తిథి. శుక్రవారం. స్వాతి నక్షత్రం.

మనం తఱచుగా ముహూర్తం అనే మాట వింటూ ఉంటాం.

పంచాంగ సిద్ధాంతులు వివాహం, ఉపనయనం వంటివాటికి నిర్ణయించే శుభ సమయాన్ని ముహూర్తం అని అనడం పరిపాటి. కాని వాస్తవంగా దానిని శుభలగ్నం అని అనాలి.

ఎందుకంటే పంచాంగ గణనలో కాలాన్ని కొలిచే ఒక ప్రమాణం పేరు కూడ ముహూర్తమే.

రెండు ఘడియల కాలాన్ని ముహూర్తం అంటారు - అంటే నలభై ఎనిమిది నిమిషాలు.

వివాహాదులకి పెట్టే ముహూర్తం వేరు.

వాడుకలో దానిసే ముహూర్తం అని వ్యవహరించడం చేత కొంత తికమకగా అనిపిస్తుంది.

కాలాన్ని కొలిచే ముహూర్తాలు ప్రతిరోజు ముప్పై ఉంటాయి.

ప్రతి ముహూర్తానికి ఒక పేరు ఉంటుంది. బ్రాహ్మీ ముహూర్తం అన్న పేరు వినే ఉంటారు.

సూర్యోదయానికి సుమారు ఒకటిన్నర గంటలముందు ప్రారంభమవుతుంది.

ఈ ముహూర్త సమయం జ్ఞానం సంపాదించడానికి, ధ్యానానికి చాలా అనుకూలమైనది అని పెద్దలు అంటారు.

మధ్యాహ్నం సూర్యుడు నడినెత్తిన ఉండే సమయాన్ని అభిజిత్ ముహూర్తం అంటారు.

ఏ పనిలోనైనా విజయం సాధించడానికి ఇది చాలా మంచి సమయమని అంటారు.

ఇలా ప్రతి ముహూర్తానికి ఒక ఫలితాన్ని నిర్ణయించారు శాస్త్రజ్ఞులు.

మరికొన్ని వివరాలు రాబోయే రోజులలో తెలుసుకుందాం.

నమస్తే.

---

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఇది కృష్ణపక్షం.

రాత్రులలో చీకటి ఎక్కువగా ఉంటుంది - ఆకాశంలో.

భూమిమీద electric lights తాలూకు కాంతులు అంతరిక్షంలో కూడ ప్రతిఫలించి ఏ నక్షత్రాలు కనబడకుండా చేస్తున్నాయి కాని కాస్త ఊరిబయటకి వెళితే తారకల మిలమిలలు కనిపిస్తాయి కృష్ణపక్షంలో.

Star gazing - నక్షత్రాలని గ్రహాలని పరిశీలించడం ఒక చక్కని విజ్ఞానదాయకమైన అలవాటు hobby.

ఆ అలవాటు గలవారికి కృష్ణపక్షం అంటే చాలా ఇష్టం - వారి పరిశీలన కొనసాగుతుంది కనుక.

ఈరోజు స్వాతి నక్షత్రం కదా.

అంతరిక్ష శాస్త్రవేత్తలు 'స్వాతీ ఏకం ప్రవాళం' స్వాతి ఒక పగడంలా మెరిసిపోతోంది అంటారు.

ఆకాశంలో చాలా ప్రకాశవంతంగా కనిపిస్తుంది.

తులా రాశిలో ఉంటుంది ఈ నక్షత్రం.

వాయుదేవుడిది స్వాతీ నక్షత్రమని అంటారు.

సింహం, కన్య, తుల, వృశ్చికం - ఈ నాలుగు రాశులనీ ఆకాశంలో గుర్తించడం కొంతవరకు సాధ్యం.

సూర్యాస్తమయం తరువాత ఇవి ఒకదాని వెనుక ఒకటి క్రమంగా కనిపిస్తూ ఉంటాయి, మరొక 6, 7 నెలలపాటు.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన పూర్వులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

-------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **మార్చి నెల 2వ తేదీ.**

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.      శిశిరఋతువు.      మాఘ మాసం.        కృష్ణపక్షం.

సప్తమి తిథి.        శనివారం.            విశాఖ నక్షత్రం.

మన పూర్వులు కాలాన్ని కొలిచే అతి చిన్న ప్రమాణం నుండి ఊహకే అందనంత అతి పెద్ద ప్రమాణం వరకు చెప్పారు.

అతిచిన్న ప్రమాణం పేరు త్రుటి.

ఒక సెకను కాలాన్ని కోటి భాగాలు చేస్తే ఎంత సమయం వస్తుందో అంత అతిచిన్న విభాగం ఒక త్రుటి.

అతి పెద్ద ప్రమాణం చతుర్ముఖ బ్రహ్మగారి ఆయుష్షు అంత.

ఒకటి పక్కని ఇరవై రెండు సున్నాలు పెడితే ఎంత సమయం వస్తుందో అన్ని సెకన్లు.

అంతేకాదు వీటిని ఎలా కొలవాలో కూడ చెప్పారు. దానికి యంత్రాలు, పరికరాలు కూడ తయారుచేసారు.

అతి సూక్ష్మమైన పరికరాలతో త్రుటి, రేణువు, పరమాణువు వంటి కాలవిభాగాలని కొలవడంతో పాటు, సామాన్య ప్రజానీకం ఉపయోగించుకోవడానికి పెద్దపెద్ద కాల యంత్రాలు కూడ నిర్మించారు. ఇవి ఒక రకమైన ప్రయోగశాలల వంటివి.

హిందీలో జంతర్ మంతర్ అంటారు.

ఢిల్లీ, జైపూర్, ఉజ్జయిని, మథుర, వారణాశి అనే అయిదు నగరాలలో వీటిని నిర్మించారు.

ఆయా నగరాలకి వెళ్ళినప్పుడు తప్పనిసరిగా చూడవలసినవి ఈ జంతర్ మంతర్ లు.

నమస్తే.

---

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఈరోజు విశాఖ నక్షత్రం.

వాస్తవంగా ఇది నక్షత్రాల జంట.

రెండు నక్షత్రాలు ఒకటిగా కనిపిస్తాయి.

ఇంచుమించు కంటికి కనిపించడం అసాధ్యంగా అతిచిన్న కాంతితో ఉంటాయి ఈ జంట నక్షత్రాలు.

అసలు ఒకదానిని గుర్తించడమే కష్టమనుకుంటే అవి జంట నక్షత్రాలని తెలుసుకోవడమే ఒక ఆశ్చర్యకరమైన విషయం.

ఏ ఆధునిక టెలిస్కోపులు, కాలిక్యులేటర్ లు లేని అతి ప్రాచీనకాలంలో నక్షత్రమండలాలని, గ్రహాల పరిభ్రమణాన్ని ఎలా లెక్కకట్టేవారో ఊహకే అందదు.

తమ జీవితాలను ఇటువంటి విజ్ఞానం కోసం పూర్తిగా అంకితం చేసిన మహనీయులు మన పూర్వులు.

కుటుంబంతోటి, సమాజంతోటి సంబంధాలు ఉంటే తమ పూర్తి సమయాన్ని పరిశోధనలకోసం వెచ్చించలేమని అరణ్యాలలో ఆశ్రమాలు నిర్మించుకొని నివసించేవారు.

తమలాగే కేవలం జ్ఞాన విజ్ఞాన సముపార్జనే లక్ష్యంగా పెట్టుకొన్నవారిని మాత్రమే తమతో కలుపుకొనేవారు.

అటువంటి ఆశ్రమాలనే గురుకులాలని, ఆ మహనీయులని మహర్షులని మనం పిలుస్తాం.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన మహర్షులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **మార్చి నెల 4వ తేదీ.**

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

శిశిరఋుతువు.

మాఘ మాసం.

కృష్ణపక్షం.

నవమి తిథి.

సోమవారం.

జ్యేష్ఠ నక్షత్రం.

సూర్యుడు ఈరోజు పూర్వాభాద్ర నక్షత్రం లోకి ప్రవేశిస్తాడు.  ఇవాళ్టినుండి సుమారు పదమూడు రోజులు పూర్వాభాద్ర కార్తె.  శిశిర ఋుతువు సగం గడిచిపోయినట్టే.

వసంత ఋుతువు ప్రవేశించే సమయం దగ్గర పడుతోంది.  కొత్త సంవత్సరం లోకి మరికొద్ది రోజులలో ప్రవేశించబోతాం.  ఋుతువుల మార్పులు హఠాత్తుగా ఒక క్షణంలో జరగవు. ప్రకృతిలో క్రమంగా వస్తూ ఉంటాయి.

శిశిర ఋుతువులో చెట్లు ఆకులు రాలుస్తాయని తెలుసుకున్నాం.

వసంత ఋుతువులో చెట్లన్నీ చిగురు వేస్తాయి.

మన చుట్టూ ఉండే చెట్లలో వేటికి ఈ లక్షణాలు ఉన్నాయో గమనించండి.

శిశిర ఋుతువులో ఏయే పూలు, కాయలు, పళ్ళు వస్తాయో, వసంత ఋుతువులో ఏవి వస్తాయో తెలుసుకోండి.

అటువంటి మొక్కలని, చెట్లని పరిశీలిస్తూ ఉంటే ఋుతువులో మార్పులు మనం గమనించవచ్చు.  దానితోపాటు గానే వాతావరణ మార్పులు అవగాహనకు వస్తాయి.

నమస్తే.

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

ఈ రోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఈరోజు జ్యేష్ఠ నక్షత్రం.

వృశ్చిక రాశిలో ఉంటుంది.

వృశ్చికరాశిని ఆకాశంలో సులభంగా గుర్తించవచ్చు.

ఒక పెద్ద ముగ్గు వేసినట్టు చాలా విశాలంగా పరుచుకొని ఉంటాయి అందులో నక్షత్రాలు.

వృశ్చికం అంటే తేలు.

ఆ నక్షత్రాలన్నిటినీ కలిపితే తేలు ఆకారంలో కనిపిస్తాయని వృశ్చికం అనే పేరు పెట్టేరు.

ఆ రాశిలో అన్నింటికంటె ప్రకాశవంతంగా కనిపించే నక్షత్రం జ్యేష్ఠ.

రోహిణి, ఆరుద్ర, స్వాతి, జ్యేష్ఠ ఇవన్నీ బాగా కాంతివంతంగా కనిపించే నక్షత్రాలు.

మనలో కొందరం అయినా star gazing ని hobbyగా చేసుకుందామా!

రాత్రిపూట మనకి పరిచయమైన నక్షత్రాలని గ్రహాలని చూస్తూ ఉంటే ఆత్మీయులని చూసిన అనుభూతి కలుగుతుంది.

కొన్నిరోజులపాటు వివిధ కార్యాల వలన వాటిని చూడడం జరగక, మళ్ళా ఎప్పుడో ఒకరోజు చూస్తే బంధువులని మిత్రులని చూసినట్టు, అవి మనలని పలకరించినట్టు అనుభూతి కలుగుతుంది.

ఒక అనుబంధం ఏర్పడుతుంది వాటితో.

అందుకే మన సంస్కృతి ప్రకృతిని ప్రేమించే సంస్కృతి.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన మహర్షులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

-----------------------------------------“   “---------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **మార్చి నెల 5వ తేదీ.**

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం.  శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.  శిశిరఋతువు.   మాఘ మాసం.   కృష్ణపక్షం.

దశమి తిథి.     మంగళవారం.    మూల నక్షత్రం.

శిశిర ఋతువు మరోనెల మాత్రమే మిగిలి ఉందని నిన్న అనుకున్నాం.

గమనించారా ప్రకృతిలో వస్తున్న మార్పులు.

హేమంత ఋతువులోను, శిశిర ఋతువులోను విరివిగా వచ్చే చామంతి పూలు క్రమంగా తగ్గుతున్నాయి.

బంతిపూలు కూడ ఈ రెండు ఋతువులలోనే ఎక్కువగా పూస్తాయి. ఆ తరువాత అరుదైపోతాయి. శీతాకాలంలో పూచే డిసెంబరు పూలు, డాలియాలు వంటివి కూడ క్రమంగా తగ్గుతున్నాయి.

క్యాబేజీ, కాలీఫ్లవర్, కారట్ వంటి కూరగాయలన్నీ ఈ శీతాకాలపు పంటలే.

చింతపండు, చెఱకు వంటి పంటల దిగుబడి వచ్చేది ఇప్పుడే. ఇంక మళ్ళీ సంవత్సరం వరకు కొత్తపంట రాదు.

శిశిర ఋతువు చివర, వసంత ఋతువు ప్రారంభంలోను, మామిడిచెట్లకి పూత మొదలై చిన్న పిందెలు ప్రారంభమవుతాయి.

మామిడి చిగుళ్ళని తినే కోకిలల పాటలు అక్కడక్కడ వినిపిస్తాయి.

ఈ రకంగా మనం ప్రకృతిలో మార్పులని గమనిస్తూ కాలాన్ని గుర్తించగలం.

దానికి తగిన జాగ్రత్తలు తీసుకోగలం.

నమస్తే.

---

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

రాబోయే సోమవారం ఈ విద్యా సంవత్సరపు ఆఖరిరోజు మన స్కూలులో.

తరువాత కొద్దిరోజులు సెలవులు.

మళ్ళా మనం కొత్త విద్యా సంవత్సరంలో కలిసినప్పుడు ఇంతవరకు నేర్చుకున్న అంశాలు గుర్తున్నాయో లేదో ప్రయత్నం చేద్దాం.

ప్రతిరోజు చిన్న క్విజ్ పెట్టుకుందాం.

అసెంబ్లీలో చెప్పుకున్న విషయం అంతా మీకు అందుబాటులో ఉండేటట్టుగా ఏర్పాటు ఉంటుంది.

మీరు చేయవలసినదల్లా సెలవుల్లో ఆ విషయాలు సరదాగా చదవడం, గుర్తుకు తెచ్చుకోవడమే.

క్విజ్ ప్రతిరోజు ఉంటుంది.

అసెంబ్లీలో ఉండవచ్చు, క్లాస్ టీచర్ సెషన్ లో ఉండవచ్చు, సైన్సు, సోషల్, ఇవిఎస్, తెలుగు, హిందీ ఇలా ఏ సెషన్ లోనైనా ఉండవచ్చు.

ఎందుకంటే మనం తెలుసుకున్న విషయాలు అన్ని సబ్జక్టులకీ సంబంధించినవి మాత్రమే కాదు, మన సంస్కృతికి, జీవన విధానానికి సంబంధించినవి.

ఏ సబ్జక్టు విషయమైనా ఎప్పుడైనా మరిచిపోవచ్చు కాని మనని, మన పద్ధతులని మనం మరిచిపోకూడదు కదా!

ఎల్లప్పుడూ గుర్తు ఉంచుకోవలసినదే సనాతన విజ్ఞానం.

అద్భుతమైన ఆ సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన మహర్షులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

-------------------------------------------“ “----------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **మార్చి నెల 6వ తేదీ.**

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం

చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

శిశిరఋుతువు.

మాఘ మాసం.

కృష్ణపక్షం.

ఏకాదశి తిథి.

బుధవారం.

పూర్వాషాఢ నక్షత్రం.

ఇదిగో ఒక్క క్షణంలో చేస్తా!

క్షణంలో వచ్చేస్తా!

అబ్బబ్బ ప్రతిక్షణం ఒక యుగంలా ఉంది బాబూ!

ఇదుగో నిమిషంలో తయారు!

రెండు నిమిషాలు కూడ పట్టదు!

ఒక్కటంటే ఒక్క నిమిషం, అయిపోవచ్చింది!

ఇలాంటి మాటలు మనం రోజూ వింటూ ఉంటాం కదా!

ఇంతకీ ఈ క్షణం అంటే ఎంతసేపు?

నిమిషం అంటే అరవై సెకన్లు గా చెప్పుకొనే నిమిషమేనా ఇంకేదైనా ఉందా?

యుగం అంటే ఎంతకాలం?  ఇవి ఏవైనా ఆలోచించారా?

నిజంగా ఆ మాటలన్నవారు క్షణం లోనో నిమిషంలోనో ఆ పని పూర్తి చేస్తున్నారా?

కాస్త పరిశోధించండి. వీటిగురించి వివరాలు రేపు చెప్పుకుందాం.

నమస్తే.

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

-------------------------------------

ఈరోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఈరోజు ఏకాదశి.

ఏకాదశ అంటే పదకొండు అని అర్థం సంస్కృతంలో.

పదకొండవ తిథి కనుక దీనిని ఏకాదశి అని అన్నారు.

భగవంతుడైన శ్రీమన్నారాయణునికి ఈ రోజు చాలా ప్రీతికరమైన రోజు.

ఏకాదశి నాడు చేయవలసినది ఏమిటంటే - భగవంతుడిని ప్రీతితోను భక్తితోను ప్రతిక్షణం స్మరించడం, వీలు చేసుకొని ఆయన ఆలయానికి వెళ్ళి ప్రదక్షిణ చేసి నమస్కరించడం, సాధ్యమైనంత తక్కువగా ఆహారం తీసుకోవడం.

ఈరోజు ఆహారాన్ని బాగా తగ్గించి తీసుకోవడం వలన జీర్ణం చేసే అవయవాలకి కాస్త విశ్రాంతి లభించి మరింత శక్తివంతంగా తయారవుతాయి.

దానిని తయారుచేసేవారికీ కొంత విరామం దొరుకుతుంది.

భగవన్నామాన్ని స్మరించడం వలన మన మనస్సు నిర్మలంగాను, పవిత్రంగాను అవుతుంది.

ఆలయానికి వెళ్ళడం వలన సమాజానికి తద్వారా మనకి హితకరమైన ఆలోచనలు వస్తాయి.

అందరూ బాగుండాలనే కోరిక పెరుగుతుంది.

ఇలా వ్యక్తికి, కుటుంబానికి, సమాజానికి కూడ ఉపయోగించే విధానాలు నిర్దేశించారు శాస్త్రాలలో.

అద్భుతమైన ఆ సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన మహర్షులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

-----------------------------------------" "---------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **మార్చి నెల 7వ తేదీ**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.  శిశిరఋతువు.  మాఘ మాసం.   కృష్ణపక్షం.

ద్వాదశి తిథి.   గురువారం.   ఉత్తరాషాఢ నక్షత్రం.

మనం ఈనాడు అంతర్జాతీయ కాలమానం ప్రకారం one hour = 60 minutes, one minute = 60 seconds అని నేర్చుకున్నాం.

ఈ minute నే తెలుగులో నిమిషం అంటున్నాం.

మన దేశంలో ఎప్పటినుండో నిమేషం అనే సంస్కృత పదం వాడుకలో ఉన్నది.

దానినే తెలుగులో నిమిషం అనేవారు.   నిమేషం అంటే రెప్పపాటు కాలం.

ఒకసారి కనురెప్పలు మూసి తెరవడానికి ఎంత సమయం పడుతుందో దానిని నిమేషం అన్నారు.   ఎంత సమయం పడుతుందో ఒక్కసారి కనురెప్పలు ఆర్పి తెరిచి చూడండి. అంత తక్కువ సమయం!

అందులోనే మూడు పనులు లేదా స్థితులు ఉన్నాయి -

కనురెప్ప మూతపడడం, మూసి ఉంచడం, మరల తెరుచుకోవడం.

ఇవి మనకి తెలియకుండానే మన ప్రయత్నం లేకుండానే  జరిగిపోతాయి.

గడియారంలో ఒక సెకను సమయంలో మనం ఎన్ని నిమేషాలు అంటే రెప్పపాట్లు చేయగలం?

ప్రయత్నించండి.

మన ప్రాచీన కాలమానంలో వాడుకలో ఉన్న ఈ నిమేషం లేదా తెలుగు నిమిషం ఇప్పటి ఆధునిక నిమిషం కన్న ఎంతో చిన్నది.  సెకను కన్నా కూడ ఎంతో చిన్నది.

నిమేషం కన్న చిన్న ప్రమాణాలు కూడ ఉన్నాయి.  వాటిగురించి కూడ తెలుసుకుందాం.

నమస్తే

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

రేపు మనకి సెలవురోజు, విశిష్టమైన రోజు కనుక రేపటి విశిష్టత గురించి ఈరోజు తెలుసుకుందాం.

రేపు మహాశివరాత్రి.

మహాశివుడు, పరమశివుడు, ఈశ్వరుడు, రుద్రుడు, పార్వతీపతి, శంభుడు, శంకరుడు, హరుడు, మహాదేవుడు, గౌరీపతి, ఉమాపతి వంటి పేర్లతో ప్రసిద్ధంగా పూజలందుకొనే దేముడు కైలాసవాసుని జన్మదినం.

మిక్కిలి పవిత్రమైనదిగా, మహాపర్వదినంగా భారతదేశమంతటా అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు జరిపేరోజు.

ఈరోజు ద్వాదశి. రేపు త్రయోదశి. రేపు రాత్రి చతుర్దశి ప్రారంభం అవుతుంది.

మాఘమాసంలో కృష్ణ పక్షంలో చతుర్దశి తిథి అర్ధరాత్రికి ఉండే సమయాన్ని లింగోద్భవ కాలం అంటారు.

పవిత్రమైన ఆ సమయంలో హారతులిచ్చి, అభిషేకాలు, పూజలు చేసి, శంఖనాదాలు, పరమశివుని నామ సంకీర్తన చేసి తరిస్తారు భక్తకోటి అందరూ.

శివాలయాలన్నీ కిటకిటలాడుతాయి దర్శనార్థం వచ్చే భక్తులతో.

శ్రీశైలం, వేములవాడ వంటి క్షేత్రాలే కాక మనకి దగ్గరలో కూడ పురాతనమైన ప్రముఖ శైవ పుణ్యక్షేత్రాలు ఉన్నాయి.

అవే దక్షారామం లేదా ద్రాక్షారామం, సామర్లకోట.

ఈ పుణ్యదినాన్ని అందరూ తమతమ ఇళ్ళల్లో జరుపుకోవడానికి వీలుగా ప్రభుత్వం సెలవు ప్రకటించింది.

దానిని సద్వినియోగం చేసుకుందాం.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన మహర్షులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

---------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **మార్చి నెల 9వ తేదీ**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.

శిశిరఋతువు.

మాఘ మాసం.

కృష్ణపక్షం.

చతుర్దశి తిథి.

శనివారం.

ధనిష్ఠ నక్షత్రం.

ప్రాచీన కాలం నుంచి మనదేశంలో అలవాటులో ఉన్న కాల ప్రమాణం నిమేషం గురించి తెలుసుకున్నాం.

నిమేషం అంటే రెప్పపాటు కాలం అని అనుకున్నాం.

అలాంటి నిమేషాలు మూడు అయితే ఒక క్షణం.

మూడుసార్లు కనురెప్పలు ఆర్పి తెరుస్తే ఒక క్షణం అన్నమాట.

దానికి ఎంత సమయం పడుతుందో ప్రయత్నించి చూడండి.

క్షణంలో ఈ పని చేస్తాం అని మనం అంటాం కద, మరి నిజంగా ఏ పనినైనా మూడు కనురెప్పపాట్ల కాలంలో పూర్తిచేయగలమా!

ఆలోచించండి!

నమస్తే.

---

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

రేపు మనకి సెలవురోజు, విశిష్టమైన రోజు కనుక రేపటి విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఈరోజు చతుర్దశి, రేపు అమావాస్య.
రేపటితో మాఘమాసం పూర్తి అవుతుంది.
సూర్యుడికి ఇష్టమైన మాసం లేదా జన్మించిన మాసం మాఘమాసం అని ప్రసిద్ధి.
మాఘ ఆదివారాలు ఇంకా ప్రసిద్ధమైనవి.
సూర్యుడు, ప్రకృతి మనకి చేస్తున్న ఉపకారానికి కృతజ్ఞులుగా ఉండడం, ప్రకృతిని పాడుచేయకుండా ఉండడమే మన విధి.

మనం ప్రతిపనిని చేస్తున్నప్పుడు అది ప్రకృతికి, పర్యావరణానికి హితకరమైనదా లేక చెడు చేస్తుందా అని ఒక్క క్షణం ఆలోచించగలిగి తగిన నిర్ణయం తీసుకోగలిగితే అదే మనం మానవాళికి చేసే గొప్ప సేవ.
అటువంటి ఆలోచనలు మనలో ఉత్పన్నం చేయమని భగవంతుడిని ప్రార్థిద్దాం.

అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన మహర్షులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజు తెలుసుకుంటూ ఉందాం.
అందరికీ నమస్కారం.

-----------------------------------------------“ “-------------------------------------------------

1వ విభాగం - పంచాంగ పఠనం చేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

అందరికీ నమస్కారం.

గ్రెగోరియన్ కాలెండర్ ప్రకారం ఈరోజు 2024వ సంవత్సరం **మార్చి నెల 11వ తేదీ**.

మనం సంప్రదాయంగా కాలాన్ని లెక్కించే పద్ధతిలో శాలివాహన శకం 1945వ సంవత్సరం

చాంద్రమానం. శోభకృత్ అనే పేరుగల సంవత్సరం.

ఉత్తరాయణం.   శిశిరఋతువు.   ఫాల్గుణ మాసం.   శుక్ల పక్షం.

పాడ్యమి తిథి.   సోమవారం.      ఉత్తరాభాద్ర నక్షత్రం.

నిమేషం, క్షణం లాగే మనలో బాగా వాడుకగా ఉన్న పదం యుగం.

దశాబ్దం అంటే పది సంవత్సరాలు.

శతాబ్దం అంటే నూరు సంవత్సరాలు.

సహస్రాబ్దం అంటే వెయ్యి సంవత్సరాలు.

యుగం అంటే సహస్రాబ్ది కంటే వందల రెట్లు పెద్దది.

కలియుగం అనేమాట వినే ఉంటారు.

ప్రస్తుతం జరుగుతున్నది కలి అనే పేరుగల యుగం. కలియుగం ప్రారంభమై ఇప్పటికి 5124 సంవత్సరాలు గడిచాయి. అంటే అయిదు సహస్రాబ్దులు పూర్తి అయి ఆరవది జరుగుతోంది. ఇంకా నాలుగువందల ముప్పై సహస్రాబ్దులు గడిస్తేగాని కలియుగం పూర్తికాదు. అంత పెద్దది ఒక కలియుగం. క్షణం ఒక యుగంలా గడిచింది అంటే ఊహించలేనంత సుదీర్ఘమైన కాలం గడిచింది అని మామూలుగా వాడుతూ ఉంటాం కాని నిజంగా అన్ని లక్షల సంవత్సరాలు పట్టింది అనికాదు కదా.

వచ్చే విద్యా సంవత్సరంలో కొత్త తరగతులలో మళ్ళా మరికొన్ని ఆశ్చర్యకరమైన విశేషాలు తెలుసుకుందాం.

అందరికీ 2023-24 విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా శుభాకాంక్షలు.

సెలవులలో మన సంస్కృతిని మరింతగా తెలుసుకోండి.

నమస్తే.

--------------------------------------

2వ విభాగం - పంచాంగ విశిష్టత తెలియజేసే విద్యార్థి చెప్పే  వివరాలు

--------------------------------------

ఈరోజు విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఈరోజునుండి ఫాల్గుణ మాసం ప్రారంభం.

సంవత్సరపు చివరి మాసం ఫాల్గుణ మాసం.

చంద్రుడు ఈ మాసంలో పౌర్ణమినాడు ఉత్తరఫల్గుని అనే నక్షత్రం దగ్గర ఉంటాడు కనుక ఈ మాసానికి ఫాల్గుణ మాసం అని పేరు వచ్చింది.

మాఘ, ఫాల్గుణ, చైత్ర, వైశాఖ, జ్యేష్ఠ మాసాలని మాఘాది పంచకం అంటారు.

మాఘమాసం మొదలుకొని అయిదు నెలల కాలం అని అర్థం.

ఈ అయిదు నెలలలో రెండవది ఫాల్గుణం.

శుభముహూర్తాలకి, శుభకార్యాలకి అనుకూలమైన కాలం.

ఈ మాసంలోనే మనం గడిచిన విద్యా సంవత్సరాన్ని ముగించుకొని కొత్త విద్యాసంవత్సరంలో అడుగుపెట్టబోతున్నాం.

అందరికీ ఈ మాసం అంతా శుభం కలగాలని, అందరూ ఉత్సాహంగా ఉండాలని ఆకాంక్షిద్దాం.  అద్భుతమైన సనాతన విజ్ఞానానికి, దానిని మనకందించిన మహర్షులకి నమస్కరించి ఆయా విశిష్టతలు ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉందాం.

అందరికీ నమస్కారం.